రామలింగారెడ్డి, కట్టమంచి

ఆంధ్రసర్వకళాశాల విద్యాప్రవృత్తి

చెన్నపురి, 1916

Record no. 706

Rāmaliṅgāreḍḍi, Kaṭṭamañci

Āṃdhrasarvakaḷāśāla vidyāpravṛtti

Cennapuri, 1916

Record no. 706

Bibliographic Record Target

రామలింగారెడ్డి, కట్టమంచి.

ఆంధ్రసర్వకళాశాల విద్యాప్రవృత్తి / సి. రామలింగారెడ్డి గారిచే విరచితము.- చెన్నపురి : ఆంధ్రపత్త్రికాముద్రాలయము, 1916.

46, 16 p. ;18 cm.

Record no. 706

Rāmaliṅgāreḍḍi, Kaṭṭamañci.

Āṃdhrasarvakaḷāśāla vidyāpravṛtti / Si Rāmaliṅgāreḍḍi gāricē viracitamu.- Cennapuri : Āṃdhrapattrikāmudrālayamu, 1916.

46, 16 p. ;18 cm.

Record no. 706

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB Date filming began:

ఆంధ్ర సర్వకళాశాల

విద్యాప్రవృత్తి

శ్రీయుత

సి. రామలింగారెడ్డి ఎం. ఏ. గారిచే

విరచితము

చెన్నపురి

ఆంధ్రపత్రికాముద్రాలయమున

ముద్రితము

1916

వెల 0.4.0] [పోస్టేజి

ఆంధ్ర సర్వకళాశాల

సంక్షేపవాదము *

ఇప్పుడు ప్రభుత్వమువారియొక్కయు, నాంధ్రప్రజలయొక్కయు హృదయదృష్టికిని, మనోదృష్టికిని గుఱియై, వారి నిరాలస్యమగు సంకల్పము నిరీక్షించి వేచియుండు ప్రారంభములలో ప్రాథమికము ప్రత్యేకాంధ్రసర్వకళాశాలా నిర్మాణోద్యమము. ఈ ప్రయత్నమునకుఁ దగిన వాక్సామగ్రి యిదివఱలోనే సేకరింపఁబడియున్నది గాని, యింకను దీర్ఘ విచారణ కవకాశము లేకపోలేదు.

ఆవశ్యకత

జాత్యాదిభావములంబట్టి కొందఱికార్య మావశ్యక మందురు. మఱికొందఱు విద్యాపద్ధతి సంస్కారార్థంబందురు. ఈ రెండవ తెగవారి సంఖ్య యధికంబు కాదుగాఁబోలు.

జనసామాన్యమునకుఁ బ్రబలకారణముగఁ దోఁచునది జాత్యాదులచే నుద్భూతమైన ప్రత్యేకభావము. మనము ఆంధ్రులము. 'తెనుఁగువార' మన్న నార్యసంత

---

* ఈ విషయముంగూర్చి యింకను దెలియఁ గోరువారు, ఈ గ్రంథకర్తచేఁ బ్రకటింపఁబడిన "Speeches on Universtiy Reform" అను పుస్తకముఁ జదువనగును. వెల 8 అణాలు.

తికిఁ దప్పినవార మగుదు మనుభయవిభ్రాంతులచే నేమో "ఆంధ్రులము, ఆంధ్రులము" అను నోరునిండు పదము వాడుకకు వచ్చినది. ద్రావిడుల చరిత్రము, దేశము, భాష, మొదలగునవి వేఱు. వారికిని మనకును విజ్ఞాన చంద్రికామండలి వారి శాస్త్రజ్ఞులొక్కరు వెల్లడిపఱచిన రసాయనసమ్మేళనము గాని, యింకేవిధమైన సమ్మేళనము గాని లేదు.

జాత్యాది కారణములు

మద్రాసు కళాశాలలోఁ బ్రతిబింబితములగు దేశభాషలు ఐదు: అఱవము, తెలుఁగు, మళయాళము, కన్నడము, ఓఢ్రము. ఇట్టి సంకరజాతికళాశాల యేప్రాశస్త్యమునైన గడింపఁజాలునా ? విద్యావిషయమున నెల్లరును సంయుక్తులు సమానులు నై యున్నారను మిషఁబెట్టి, యుద్యోగవిషయమునను అందఱను సరిసమానముగఁ బోటీచేయునట్లు నియోగింతురు. దీనిచేఁ గాదె తెనుఁగుదేశములోని యుద్యోగము లనేకములు ద్రావిడులాక్రమించుకొని మనల స్థానభ్రష్టులఁ జేసియుండుట ! నా జన్మపట్టణమగు చిత్తూరునకుఁ బట్టియుండు గతిని గమనింపుఁడు; పదునైదేండ్లక్రింద నచ్చట నఱవవా రరుదు; నేఁడు వీథిలోఁ బోవుచు, చక్కని వస్త్రములు ధరించి తాంబూలము నెమరుచు నొయ్యారముగ వచ్చు నెవనినైన 'ఫలాంనివారి యింటికిఁ త్రోవ యేది ?' యని తెనుఁగున నడిగితిమేని, యతఁడు నిరుత్తరుఁడగుటయే కాదు,

'ఈమృగ మేయడవినుండి దారిఁదప్పి వచ్చె' నని విస్మితుఁడై యెగాదిగఁ జూచును. స్వదేశమే విదేశ మయ్యెనేని, దానికన్న చెడిన యధోగతి యెక్కడిది? ఆంధ్ర సర్వకళాశాల ప్రభవించెనేని దానం జదివి కడతేఱిన బి. ఏ., ఎం. ఏ. లకుఁ గాని యితరులకు నిక్కడి పదవులు దొరకఁజాలవు. భాషయందైన సామ్యము లేనివారు రాజోద్యోగముల నధిష్ఠించిరేని, జనుల సుఖదుఃఖములను, మర్మములను అరయక గ్రుడ్డి యధికారము చెలాయింతురు. భాషలో కలయిక యున్న యెడలఁ గొంతకుఁ గొంత మనసులు గలియకపోవు; ప్రీతి పుట్టకపోదు; అట్టిచో తలమీఁది యుద్యోగుల ప్రీత్యర్థమే కాక, పాదసంగతులైన ప్రజల క్షేమార్థమును పాలనము నడచును.

ఈ హేతువులు కొన్ని సమంజసములు; కొన్ని కావు. "గవర్నమెంటు నియోగముల నిర్వైరముగ నోటవేసికొనఁదలఁచిన కించిద్విద్యాయుతుల కైతవము ఈ వాదములకు మూలమును ఫలమును" అని కొందఱు వాపోయెదరు.

సత్యమైన కారణము

మనలో నల్పులు లేకపోలేదు. ఎవ్వరిలో లేరు? అయినను మొత్తముమీఁద తెనుఁగువారియంత యుదారచిత్తులు దక్షిణాపథమునఁ గానవచ్చుట యరుదు. ఇది స్వాభావికలక్షణ మని విఱ్ఱవీఁగుట తప్పు; మఱి చరిత్రాంశసంజనితము. మిక్కుటముగ యుద్ధములు చేసి

విజాతీయులతోఁ బోరాడి, గొప్ప రాజ్యములను స్థాపించి, శౌర్యము ధైర్యమును బ్రకటించిన యోజనులలోఁ గాని, నక్కజిత్తులు తక్కువ యోజనలు తఱచు ప్రబలవు; ధారాళమగు బుద్ధి వ్యాపించును. తెనుఁగువారి పూర్వచరిత్ర యట్టిది. ప్రకృతగుణములు నట్టివే. నేటికిని గవర్నమెంటుద్యోగములే ప్రాణమానాధారము లని మనవారు నమ్మినట్లు కానము. ఇఁక ముందు నమ్మెద రనుటయు విశ్వసనీయముగాదు. మాతృభాషారక్తి, దేశభక్తి, సంఘసంస్కారము, వాణిజ్యము మొదలగు స్వతంత్రప్రచారములే మనకుఁ బ్రాణములు కాని, కలెక్టరు కచ్చేరీ గుమాస్తాపనులు కావు. సేవావృత్తియందు మన కభిరుచి తక్కువ. అది మన రక్తములోఁ బదిలముగ నింకను బట్టువడలేదు. ఎన్నఁడును బడకుండుఁగాక! ఒక్క బంగాళాదేశము విడిచి చూచినయెడల ఆంధ్రమండలమునఁబలె జాతిభావ మిం కెందును ఇంత దట్టముగ నింకి యూరియుండలేదు. అట్టి మనము ద్రావిడులయెడ వైరము అసూయ పూని, పగ సాధింప నీ సర్వకళాశాలాయుక్తి పన్నినార మనుట శుష్కహృదయుల నైచ్యమును వెల్లడించు నింద. ఆంధ్రులఁగూర్చిన యీ శ్లాఘనవాక్యములు, మధ్యస్థులగు పాశ్చాత్త్యులచే పదేపదే యుపన్యసింపఁబడినవియే కాని, నా కల్పనలు గావు. ఆంధ్రోద్యమ మంతయు నుద్యోగనిమిత్త

మైన కడుపాత్రముచేఁ గల్పింపఁబడిన మంత్ర మని గాలి దాఁటున నైన సంశయించు నేని దేశభక్తుఁ డెవ్వఁడును దీనికి సమ్మతింపఁడు.

"దేశభాషలందుఁ దెలుఁగు లెస్స" యనుట యభిమానముతోఁ జేరిన స్తోత్రము గాని సత్యముచే నాదేశింపఁబడిన దనుట సాహసపు మాట.

"తెనుఁగు లెస్స"

లెస్సయైన నేమి? కాకున్న నేమి? మనకు మన భాషయందు వాత్సల్య మెక్కువ; ఇది సహజము, అనింద్యము. ఆ భాషకు ప్రకృతము విద్యాదాయక పద్ధతులలో ప్రవేశము తక్కువ. ఈ విషయమైన సంస్కారమునకై మన మెంత ప్రయత్నించినను, ఇప్పటి స్థితిగతులఁబట్టి చూడఁగా, నుదాసీనులై యుండు నితరదేశభాషలవారును మనతో నేకీభవించినఁ గాని కొనసాఁగదు. ఒక్క భాషామాతకుఁ బుట్టిన సంతానమునే యైకమత్యము గలదిగాఁ జేయుట దుర్ఘటమన్నచో, నిఁక బహుభాషాసంతానముల నొక్కమందలోనికిఁ దెచ్చుట లేశకార్యమా? సర్వభాషలను సమముగఁ జూచు సమవర్తి మన యూనివర్సిటి. మనలో నైకమత్యము చాల దను సాకుఁబెట్టుకొని, యిప్పటి దుస్స్థితిని శాశ్వతముగాఁ జేయుకమానదు. ఎట్లును, ప్రత్యేకింపఁబడినఁ గాని, యాంధ్రమునకు ప్రత్యేక సత్కారము గలుగదు; కలిగింపఁగాదు.

హిందూదేశము దేశము గాదు; మహాఖండము. బంగాళా, బొంబాయి, ద్రావిడము, పంజాబు మొదలగు మండలములవారు మొత్తముమీఁద నభిన్నులయ్యును, కొన్నివిధముల భిన్నప్రకృతి గలవారు. అట్లగుటఁ దమతమ స్వభావముకొలఁది తమ గుణగణమ్ముల వికసింపఁజేసికొని తమకే కాదు, దేశమునకును మేలు; కీర్తి. ఈ మాత్రమున కనుగుణమగు స్వాతంత్ర్యము యుక్తము. ఇట్లు పరిమితప్రత్యేకత్వముఁ గాంచినంతననే పరస్పరవైరమెత్తి దేశముయొక్క యైక్యప్రభావమును చించి చెండాడుదురని భయముగొనుట భ్రాంతిమదలంకారమో లేక వికారమో! బంగాళా మద్రాసు రాజధానులు వేఱుగా నున్నవిగదా? మనకును వారికిని ఎన్ని యుద్ధములు నడచినవి? నడువనున్నవి? అంగములు వేఱయ్యును దేహపోషణమున సంయుక్తతం దాల్చినట్లు, మండలములు వేఱయ్యును దేశసముద్ధరణమున సంయుక్తతం దాల్చిన రాష్ట్రములు లేవా? అపురూపములా? అమెరికామహాదేశము సంయుక్తరాజ్యతంత్రంబు గలిగి వర్ధిల్లుచుండుటఁ జూడమా? కావున మండలములు వేఱుపడినను, మనసులు వేఱుపడవని నా నమ్మిక. యూనివర్సిటీలు వేఱుపడిన దాని విచ్ఛిన్నతాప్రభావమింకను దక్కువగ నుండు ననుట కేమి శంక!

దీనిచే నైకమత్యము చెడునా?

విద్యాబోధకవిధాన సంస్కారములు

శాస్త్రము యొక్క ముఖ్యోద్దేశము ప్రకృతిని మనుష్యునకు వశగతముం జేయుట; శిక్షయొక్క ముఖ్యోద్దేశము మనుజుని సంఘమునకు వశగతుం జేయుట. సంఘాభివృద్ధికి ననుకూలింపని విద్య లెంత మనఃపీడకము లయినప్పటికిని విద్యలు కానేరవు. దేశశ్రేయమునకుఁ గావలసినవిద్య లెవ్వి? అయ్యవి యిప్పుడిట నుండు విద్యాలయములచే నుద్ధరింపఁబడుచున్నవా? కావేని యేకారణములఁబట్టి? దేశభాషలను ముఖ్యభాషలుగా నవలంబించిన సర్వకళాశాలలను, ఒక్కొక్క భాష కొక్కొక్కటిగా స్థాపించితిమేని, ఈ లోపములు నివారితములౌనా? శిక్షాసంస్కారపరమైన దృష్టితోఁ జూచువారికి ప్రధానములుగాఁ దోఁచు నాలోచన లివియే.

గౌరవార్హులగు శ్రీ మదనమోహన మాళవీయ పండితులు మన కళాశాల లన్నియుఁ బురాతనము లనియు, నీ కాలమునకుఁ బనికిరావనియు పచ్చిగఁ బల్కియున్నారు. ఆధునికకళాశాలల పనిపాటుల గమనింపనిది, మన కళాశాలల కాలాతీతత్వము గోచరింపదు. అట్లగుట సర్వకళాశాలల శిక్షావిషయిక నిర్మాణము నాలోచింతము.

ఆధునికకళాశాలలవ్యాపారములు బాహ్యములు, ఆభ్యంతరములు నని రెండు దెఱఁగులు. తమ ప్రాకార

ములోఁ బ్రవేశించి, క్రమముఁ దప్పక నడుచుచుండు విద్యార్థులకొఱకునై చేయఁబడు కృత్యములు ఆభ్యంతరములు. ఇప్పుడు మన యూనివర్సిటీలు, హైస్కూళ్లు, యావత్తుశాలలు నడుపు పనులు ఇట్టివి.

అభ్యంతరశిక్ష

ప్రకృతి యనఁగా భాగము. అభ్యంతరప్రకృతులు ద్వివిధములు: బి.ఏ., ఎం. ఏ. యను బిరుదులకుఁ దగిన విద్యలఁ జెప్పు ప్రకృతి యొకటి; అంత గొప్పవిద్యాగాంభీర్యము నాశింపక తక్కువ బిరుదముల మాత్రము కోరి యభ్యసించు వారికి, వారికిఁ దగిన జ్ఞానదానము నొసంగునది రెండవది. ఈ రెండవ ప్రకృతి యీ దేశములో మృగ్యము. కాలధనవ్యయములఁ గోర్వఁజాలనివారును, ఒకటిరెండేండ్లైన యూనివర్సిటీలోఁ జేరి, నియమితవిద్యాచక్రమున నొకటి రెండు భాగముల మాత్రము స్పృశించి, కొంతకుఁ గొంత మేలు వడయుదురు. దీనిచే విద్యాపరిశ్రముల సంఖ్య యెక్కువ యగును. బాలురకు విద్యను బోధించు పద్ధతుల నేర్పెడు శిక్షాశాస్త్రము, మనయందు బి.ఏ. లో కడతేఱిన వెనుక లభింపవలసిన భాగ్యము. ఇతర దేశములందు పట్టపరీక్షకుం బఠనీయములైన భాగములలో నదియు నొకటి. అట్లగుట శిక్షావిధానమున సమర్థులైన యుపాధ్యాయుల సంఖ్య, యిచ్చటఁబోలె

అభ్యంతర ప్రకృతులు

నచ్చట క్షామబాధఁ దాల్చినది గాదు. క్రొత్తక్రొత్త పాఠశాలల నేఁటేఁట వేలకొలఁదిగ స్థాపించి విద్యను ప్రసరింపఁజేయు రాజ్యములలో నెల్ల నీపద్ధతి యనివార్య మనియు శ్రేయస్కర మనియు భావింపఁబడు చున్నది. విద్యలు ద్వివిధములు: శాస్త్రములు, కళలు అని. శాస్త్ర మనఁగా విజ్ఞాన మిచ్చునది. కళ యనఁగా నేర్చిన విద్యను మనుష్యప్రయోజనార్థ ముపయోగించు నేర్పు. తత్త్వము, చరిత్రము, అర్థశాస్త్రము, తర్కము, ఇత్యాదులు శాస్త్రములు; శిల్పము, చిత్రరచన, వైద్యము, వాస్తువు, రంగులు వేయుట, సబ్బు మొదలగు సామగ్రులఁ జేయుట, వాణిజ్యము, వ్యవసాయము, గనులఁ ద్రవ్వుట, లోహపుఁబనులు, ఇత్యాదులు కళలు. వట్టి విద్యలచేఁ బొట్ట నిండదు; రాజ్యము బలవంతము గాదు; పరివర్తనకళలు నాగరకతకుఁ బ్రాణములు; పురోవృద్ధికి మూలములు. శాస్త్రజ్ఞుడు వెలివఱచిన వస్తుగుణమ్ములను, తత్త్వములను, మానవకోటియొక్క క్షేమార్థమై క్రియలలో నిగుడఁ జేయుట కళ యనఁబడును. కన్నులు మూసికొని చదివినను శాస్త్రజ్ఞాన మలవడును; ఒడలు వంచి, ప్రతిదినముఁ జేసిచేసి యభ్యసింపనిది కళ పట్టువడదు. శాస్త్రము కళకు వేరువంటిది; కళ శాస్త్రమునకు పండువంటిది. వీని సంయోగము పురోవృద్ధి, వియోగము క్షయము;

అట్లగుట నాధునికసర్వకళాశాలలయం దెల్ల నీ రెండు విద్యలును సమన్వితములు చేయఁబడియున్నవి. "లీడ్స్" అను నింగ్లాండులోని యూనివర్సిటీలో నభ్యసింపఁ గూడిన కళలు: యంత్రములు; బాటలు వంతెనలు వేయుట మొదలగు క్రియల నేర్పు వాస్తువు; విద్యుచ్ఛక్తి; గనులు; లోహములు; ఇంధనములు; వ్యవసాయము; రసాయన శాస్త్రప్రయోగము (రంగులు, రంగులు పట్టించుట ఇత్యాదులు); చర్మములఁ దయారుచేయుటకై వలయు రసాయన శాస్త్ర ప్రయోగములు; దూది ఉన్ని మొదలగు పోగులుగా రాఁజాలిన సరకులతోఁ జేయఁబడు నేఁతపని; ఇత్యాదులు. వాణిజ్యకళ ప్రకృతులలో నొకటి. మనలో పౌరాణికసర్వకళాశాలలకును, ఆధునికసర్వకళాశాలలకును గల తారతమ్యము విప్పి చెప్పనేల? వేనిచే ప్రజలకెక్కువ యుపకారము గలుగుచున్నదో యదియు సర్వవిదితము. వైదికపద్ధతికిని బ్రిటిష్ ఇండియా పద్ధతికిని గల భేదమే మనఁగా, తాటాకులకు బదులు కాకితములు ప్రచారమునకు వచ్చినవి; ఇంకేమియు లేదు.

కళాశాలయందు క్రమవిద్యార్థులుగఁ బ్రవేశింపఁ జాలని వారికిని విద్యాదాన మొసఁగుటకు బాహ్యక్రియ యనియు, విద్యావ్యాపన కార్య మనియుఁ బేళ్ళు. వృత్తుల నధిగతు

విద్యావ్యాపనము

లైన కాఁపులు కమ్మరులు మొదలగు కష్టజీవులకును మనోవికాసముఁ గల్పింపఁజూచుట ప్రత్యాధునిక విద్యాశాలయుఁ జేయు ముఖ్యకార్యములలో నొకటి. మన దేశమున నీ ప్రారంభ మెక్కడను అంకురింపలేదు. శక్తి లేమినో, రక్తి లేమినో, బుద్ధి లేమినో ఊహ్యాము. మన విద్యాధికులకును విద్యావ్యాపనముఁగూర్చి యట్టే తెలియదు. కావున నొకింత దీర్ఘముగఁ జర్చించుట యావశ్యకము.

విద్యార్థు లిచ్చు వేతనములతో మాత్రము ఏ యూనివర్సిటీయు నిజజీవనము శాశ్వతముగ నిల్పుకొనఁ జాలదు. దాని పోషణకై జనసామాన్య మిచ్చు పన్నులలోఁ గొంత భాగము నైవేద్య మియ్యవలయును. ప్రాణదాతలైన ప్రజలకును అది ప్రత్యక్షసేవ చేయుట ధర్మమే కదా! ధర్మమే కాదు; నీతియును. ఎట్లన, ప్రజానీకము అర్థవంతము గుణవంతము నై యుండదేని తుదకు తనకే ముప్పు. పాశ్చాత్త్యులలో సర్వప్రజాసమ్మతిమీఁదఁగాని, రాజ్యపరిపాలనము కొనసాఁగదు. ప్రజలలో విద్యాబుద్ధులు సంరక్షితములు గాక వినాశితము లైనచో, మూఢరాజ్యము సిద్ధించి రాజ్యమే చెడును. కావున, నే గవర్నమెంటువారును ప్రజల నశ్రద్ధతోఁ జూడఁగాదు. ప్రభువే ప్రజ; ప్రజయే ప్రభువు. ఇఁక ప్రజార్థము కాని

విద్యాశాలలు: ప్రజలు

ప్రభుత్వ మను శోభ యెట్లు? సర్వ కళాశాలలు, హైస్కూలులు, ప్రతియంతస్సు విద్యాశాలలును, శక్తి కొలంది విద్యాప్రకటన మొనర్చెడిని.

అమెరికాఖండములోని యగ్రగణ్యములం దొక్కటి యని పేరువడసి, యనేకసర్వకళాశాలలకు మాతృకయు మార్గదర్శకము నై విరాజిల్లు

విద్యావ్యాపన పద్ధతులు

"విస్కాన్సిన్" అను మహా యూనివర్సిటీ యందుంబలె నీలోకమున నెక్కడను జ్ఞానప్రకటనపద్ధతులు, ఇంత మంచిస్థితికిం దేంబడియుండలేదు. ఈ పరిపూర్ణతను వర్ణించితిమేని ఈ విషయము సుబోధ మగును.

విద్యావ్యాపనకర్మాంగములు నాలుగు: (౧) గ్రంథప్రకటనము; (౨) ప్రసంగము; (౩) ఉత్తరప్రత్యుత్తరముల మూలమునం జేయంబడు బోధ;

విస్కాన్సిన్ యూనివర్సిటీ విద్యావ్యాపన పద్ధతులు

(౪) చర్చలు నడుపుట. విద్యావ్యాపనము యొక్క ముఖ్యార్థము లియ్యవి:—(౧) కళాకౌశలము; (౨) వ్యవసాయాభివృద్ధి; (౩) సంఘీభావాభివృద్ధి; (౪) ఉపస్వతంత్రపరిపాలనాస్థానము లగు మునిసిపాలిటీలు మొదలగు వానిని సాహాయ్యముం జేసి మంచి స్థితికిం దెచ్చుట; ఇత్యాదులు.

ఒక్క వ్యవసాయమును మాత్ర ముద్ధరించుటకై యనుగ్రహింపంబడిన శిక్షావిధానము లెన్నియో గమనింపుడు:—

వ్యవసాయాభివృద్ధిపద్ధతులు

కాంపువారికి నుపయోగపడు గ్రంథములం బ్రకటింతురు. గ్రంథము లనంగా రామాయణమువలె మనుష్యుని మోంత గలయవి కావు; పగలంతయుం

౧. గ్రంథప్రకటనము

బొలములం గష్టించి వచ్చిన కృషీవలులు విరామార్థమును ప్రయోజనార్థమును శ్రమలేక చదువందగిన చిన్నపుస్తకములు. వీని నిష్ప్రయోజన పరమగాఢశాస్త్రఘోష లెక్కన; వృత్త్యనుష్ఠానములకుం బనికివచ్చు తంత్రవాలు నుండును. పాశ్చాత్యులీ కార్యవిషయమున వంధ్యవిద్య నుపాసింపరు. ప్రాణముల కొఱకుం బుస్తకములు; పుస్తకముల కొఱకా ప్రాణములు?

పనిపాటలు లేక విరామముగా నుండు శీతర్తువులలో సమీపస్థులను యూనివర్సిటీలోనికే పిలుచుకొనివచ్చి, 'స్వల్పకాల విద్యార్థు' లని పరిగణించి, రెండు మూండు మాసములు వ్యవసాయకళకుం జేరిన క్రియల బోధింతురు.

౨. చలికాలపువిద్య

ఈ తరగతులయందును సద్యోభ్యాసమునకు వీలైన క్రియలంగూర్చిన చర్చ లెక్కువ. బాహ్యవిద్యావ్యాపనమున ముఖ్యముగ నాదరింపంబడునవి ఇట్టి క్రియాశాస్త్రములే కాని వట్టి తత్త్వములు గావని యెఱుంగునది.

'విస్కాన్సిన్' అమెరికా సంయుక్తరాష్ట్రములలో నొకటి. ఆ రాష్ట్రమునకుం జేరిన పల్లెయలలో మూండు నాలుగు వారములు నడుపంబడు వ్యవసాయ

3. స్వల్పకాల పాఠశాలలు

కళాబోధకశాలల నేర్పఱచి చుట్టు ప్రక్కల వారికి క్రొత్త తెలుఁగులఁ గృషిచేయుట నేర్పుదురు. వీనికి "స్వల్పకాలపాఠశాల"లని పేరు.

కృషి, వాణిజ్యము, కళ, అను నీ మూఁడు తెలుఁగుల వృత్తులందును నూతన పరిశోధనలు పాశ్చాత్యులలో ప్రతిదినము వెలువడుచున్నవి;

౪. పత్రికా ప్రచారము

సంస్కారములు కనుఁగొనఁ బడుచున్నవి. వీని నెల్ల ప్రజాబాహుళ్యమునకుఁ గాలయాపనము లేనియట్లు వివరింపక, పండితమండలుల హృదయాంతరాళమందే మూఁటగట్టి భద్రముగ పాఁతిపెట్టినయెడల, రాజ్యమున విద్య హెచ్చినను వృద్ధి హెచ్చదు. మనము వెనుకఁబడుదుము; పురాణపురుషుల మాదుము. ఈ యుపాధి దప్పించుటకు, ఈ నాళ్ళలో సంధ్యకన్న నెక్కువ క్రమముగ నుపాసింపఁబడు వార్తాపత్రికల ద్వారా, నూతనసంగతులఁ బ్రచురించుటకై సమర్థులగు విద్యాధికుల నియమించి యున్నారు.

అచ్చటచ్చట ప్రసంగములు చేయుటకై దే

౫. ప్రసంగము

శాటనముఁ జేయు నుపాధ్యాయు లున్నారు.

వృత్తుల నెల్ల నగ్రగణ్యము కృషి. కృషియే కళలకు నాలవాలము. కావున ప్రతిదేశమునందును కృషిని ముఖ్యముగ నుద్ధరింపఁజూతురు. అయిన నొక

౬. నిదర్శన క్షేత్రములు

యిక్కట్టు: కాఁపులు మంద బుద్ధులు; నడవడి యంతకన్న మందము; నూతనమన్న భయము; ప్రాఁత యన్న భక్తి; మాంద్యము మౌర్ఖ్యముఁ గలిసినవారు; "గుండ్రాతికి కాళ్ళు వచ్చి గునగున" నడువఁజాలినను, వారు అలఁతులఁ గదలరు; చెప్పిన వినరు; అయిన నొక్కటి; చేసి చూపితిమేని యనుసరింతురు; ఒక్క పర్యాయము పట్టుపట్టిరేని కొంచెమున విడువరు. ఆధునిక శాస్త్రములును కళలు నాదేశించు పద్ధతుల నవలంబించునట్లు వీరిని ప్రోత్సాహపఱచుటకునై ప్రభుత్వమువారును, సర్వకళాశాలల వారును, గ్రామసమీపములఁ బొలములఁ గొని, తమ కింకరులచే మేలిమి విధమ్ముల సాగుబడి చేయించి, ఫలము చూపి, ప్రాచీనాచారపరాయణుల శంకయు జంకును బాపి, సంస్కారపరాయణులఁ జేతురు. పంటల యాధిక్యమును జూపి నిరూపించుట తప్ప జయప్రదమైన తార్కాణ యింకేదియు లేదు. లాభమో నష్టమో యను సంశయమునకు నెడ ముందుపట్ల, ఎందఱు శాస్త్రజ్ఞులు చెప్పినను, బీదలైన కాఁపులు తమ సర్వస్వముఁ బరీక్షార్థమై యేదేశమందును కాలమందును ధారవోయరు. ప్రత్యక్షప్రమాణముచేఁ గాఁపులకు కృషికౌశలమును నేర్పుటకై యూనివర్సిటీలు మొదలగు ప్రకృతులచే నిర్వహింపఁబడు క్షేత్రములకు

"నిదర్శన క్షేత్రము" లని పేరు. ఇట్టివి అమెరికా ఖండములో జిల్లాకు నైదాఱు చొప్పున స్థాపింపఁబడి యున్నవి. కృష్యాదులకుం జేరిన సంస్కరణముల శోధించువారును సృజించువారును దామే యగుటచే, అట్టి క్రియ లెవ్వారి యనుష్ఠానము లేనిది నిరర్థకము లగునో, యట్టి కాఁపులకు నిస్సందేహముగ నిరూపించి చూపుట, యూనివర్సిటీవారు న్యాయముగఁ బూన వలసిన భారమే కదా!

౭. ఉపదేశము, విచారణ.

తామే సొంతముగ సాగుబడి చేయించుట లేశ కార్యము గాదు. చేయఁజాలినను ఎన్ని పొలముల నుద్ధరింపఁగల్గుదురు? కొన్నింటి మాత్రము. ఇఁక నీ పొలముల దర్శించి పరీక్షించి కృతార్థు లగుటకై వ్యావసాయికు లెల్లరును దండోపతండములుగ క్షేత్రయాత్ర రాఁగలుగుదురా? ఈ లోప పూర్తికై గ్రామములకుఁ బోయి, యందలి సాహసాధికులతో ప్రస్తావించి, నమ్మకముఁ బుట్టించి, నూతనవిధముల వ్యవసాయము సాఁగించునట్లు ప్రేరించుటకై కళాభిజ్ఞులు నియమింపఁబడియున్నారు. ఉపదేశము చేయుట వీరి మొదటి పని; అనుష్ఠానములు నిర్విఘ్నములుగ జరుగుచున్నవా లేవా యని యెడతెగక విచారించుట రెండవది. వీ రప్పుడప్పుడు పోయి చూచి, పంటల నారసి గురుధర్మము చెల్లించుచుండవలయును.

ప్రత్యక్ష గురు శిష్య సంవాదములు సదా జరుపుట యసాధ్యము. ఇంతకన్న లఘుతరము పోస్టుద్వారా చర్చించుట. ఉత్తరప్రత్యుత్తరమూలమున కళాదక్షుతను బెనుచు నంగ మొకటి నియమింపఁబడియున్నది.

౮. ఉత్తర ప్రత్యుత్తరములు

ఒక్క కృషివిషయమై చేయఁబడు దోహదము లిన్ని! ప్రజాసేవనమే కదా ప్రభుత్వముయొక్క ముఖ్య కర్మము; ధర్మము!

కృషికై యెన్నివిధముల సాయ మొనర్తురో, యన్ని విధములఁ బరివర్తనకళలకును సాహాయ్య మొనర్తురు. జిల్లాలు, తాలూకాలు, మునిసిపాలిటీలు, యూనియనులు, మొదలగు పరిమిత స్వాతంత్ర్యముగల రాజ్యభాగములు ధనాఢ్యములు కావు గాన, వానిచేఁ జేయఁబడు పరిపాలనకార్యమున విశేష ప్రావీణ్యముం దాల్చినవారికిఁ దగు సంబళముల నిచ్చి యుద్యోగముల నిలుపుకొననేరవు. వీని సాహాయ్యార్థమై యూనివర్సిటీలు, ఆకార్యమున నిపుణులైన వారిని దమ యొద్ద నుంచుకొని వానికి నెరవలి యిచ్చును! మునిసిపాలిటీ సహాయకాంగ మొండు "విస్కాన్సిన్" సర్వకళాశాలయందుఁ గలదు. ప్రతి మనుజుని వేర్వేఱుగఁ బిలిచి బోధించి చక్కఁబెట్టుటకు బ్రహ్మకైన నలవి కాదు. మనుష్యులను సంఘము

ఇతర కళలు

లుగాఁ బ్రోగుచేసినచో కాలధనవ్యయము, శ్రమాధిక్యమును తగ్గించుకొనియు, ఒకనికి మేలు చేయునంతలో అంతమేలు నూర్గురికిఁ బట్టింపఁగల్గుదుము. జనులై కలయిక లేకయుండు గ్రామ్యులలో సంఘీభావము, సంఘముల నుత్పత్తిల్లఁ జేయుటకునై, సంఘీకరణాంగమొండు ఈ యూనివర్సిటీవారు పోషించెదరు. కూలి నాలి చేసి బ్రతుకు కర్మణ్యులకునై, రాత్రిపూటల 7½ గంటలనుండి 10 గంటలవఱకు, యూనివర్సిటీలు హైస్కూళ్ళు, ఇంకను దక్కువ పాఠశాలలును, క్లాసులు నడుపుటకు చేయు నేర్పాటులు సర్వవ్యాప్తములు; అనఁగా ఇండియాలో మాత్రము తప్ప. బుద్ధిమాంద్యము, వృద్ధిమాంద్యము లేని దేశములలో విద్యాశాల యన్న తనకడప దాఁటివచ్చు విద్యార్థులను మాత్రము విచారించుకొను శాల గాదు; కడపబయటివారిని గూడ కడు నపేక్షతో నరసి కడుపారఁ బెట్టెడు కన్నతల్లి!

ఆధునిక శాలా కర్తవ్యము

కావ్యములు, నాటకములు, చరిత్రము, తత్త్వశాస్త్రము, ప్రాచీనభాషలు, మొదలగు జీవనాధారములతో ప్రత్యక్షసంబంధము లేని విద్యలే గౌరవార్హము లనియు, ప్రపంచ వాసనలేని వగుట మనుష్యసేవ్యము లనియుఁ, బౌరాణికకళాశాలలు వానినే యుపాసించినవి. నిష్ప్రయోజనతంబట్టి ప్రముఖతి నిర్ణయించినవి కాఁబోలు! ఆధు

నికముల దృష్టియుఁ బథమును వేఱు. పరస్పరవైరము, ఆర్థికస్పర్ధ, జాతివైషమ్యము, పరాక్రమబుద్ధియుఁ బ్రబలిన కాలములలో ఆధ్యాత్మికముల ధ్యానించుచుండిన ప్రాణములు దక్కవు; ప్రాణములు పోయిన పిమ్మట ఆ ఆధ్యాత్మికములకును నిలువఁజోటుండదు. శాస్త్రవిద్యలు అందఱకు సాధ్యములు గావు; మఱి విశేషప్రజ్ఞావంతులకు మాత్రమే. కాయకష్టముచే నెఱవేఱఁగల కర్మలు సర్వజనసాధ్యములు; అనఁగా అంగవైకల్యము లేని యెడల. యూనివర్సిటీ పఠనీయములలో కళలకును స్థానముండవలయు. ప్రధానములు చేయఁబడినను దోషము లేదు. ఎట్లును, శాస్త్రములు, కళలు, కృషి, యివన్నియు మిశ్రములుగా లేని ప్రాఁత తరహా కళాశాలలు కాలవిరుద్ధములు; విపరీతములు. మిశ్రవిద్యాశాలలే గరిష్ఠములనియు కర్తవ్యము లనియు నిప్పటి విద్యాదాయకమార్గనిర్మాణకర్మఠుల దృఢాభిప్రాయము.

మాతృభాష

విద్యావ్యాపన కార్యమునకు మాతృభాషాప్రయోగము ప్రధానము. అభ్యంతరవిద్యలందు కళలకు ముఖ్యస్థాన ముండవలె నంటిమేని, కళలు వ్యవహారములకుం జేరిన వగుట, నవియు వ్యావహారికభాష యగు మాతృభాష మూలముగ నేర్పఁబడినఁ గాని యుపయోగకరములు కానేరవు. ప్రకృతము మన విద్య లన్నియు గొడ్డుపోయియుండుటకుఁ

గారణ మే మనఁగా, కాలేజీలోని భాష భావములకును, ఇంటిలోని భాష భావములకును క్వార్థత్తునకుఁ బలె సంధి లేమి. పరదేశభాష వ్యావహారిక మేనాఁటికైన నౌ ననుట పిచ్చితలంపు; తలవంపునకుఁ గారకము.

ఇట్లనుటచే నింగ్లీషును దేశమునుండి వెడలఁ గొట్టవలయు ననుట నా యాశయము గాదు. ఇంగ్లీషు లేకున్న దేశమే యుండదు! వివిధభాష లుండు

ఇంగ్లీషు

భరతఖండములో ఐకమత్యార్థమై సామాన్య భాష యుండితీరవలయును. పాశ్చాత్యభాష యగు నింగ్లీషు ఇందునకు నెత్తిన భాష. మఱియు నాగరకాగ్రేసరదేశములలో జరుగు వర్తమానముల నరయుటకు ననుకూలించిన సాధనము. ఇంగ్లీషు పోయినఁ గన్నులు పోయినవార మగుదుము; మాతృభాష పోయిన చేతులు లేనివార మగుదుము. రెండు నుండవలయు. ఇంగ్లీషు ముఖ్యోపభాషగా నుండిన మేలు.

సర్వకళాశాలలఁ గూర్చిన విమర్శనలఁ దెలిసిన వార మాట, నిఁక నాంధ్రులకు ప్రత్యేకకళాశాల యావశ్యకమా యను ప్రశ్నను గైకొందము.

ఆంధ్ర సర్వ కళాశాల

యూనివర్సిటీ లేల? ఉద్యోగస్థులను దయారు చేయుటకా? ప్రజలను ముందునకుఁ దెచ్చుటకా? దీని కేమి యుత్తరమో దాని ననుసరించి తక్కిన యుత్తరము లేర్పడును. ప్రజాప్రయోజనార్థ మన్నయె

డల నాధునికరీతి గల యూనివర్సిటీ కావలయును. ఇది యాంధ్రనాయకులకు సమ్మతమా? "ప్రాచీనవిధము గల యూనివర్సిటీ సాధ్యము, తదితర మసాధ్య" మని యందు రేని, ఆ 'సాధ్యము' అభిలషింపఁదగినది కాదు; వరముగ నిచ్చినను వల దని నా యభిప్రాయము. ఆధునిక విద్యావిధాన పరిశీలజ్ఞులయు నభిప్రాయ మిట్టిద. ప్రత్యేకప్రాచీనాచారసర్వకళాశాలాస్థాపనచే, ఇప్పటి స్థితిలో నుండు లోపములు నివారింపఁబడవు. క్రొత్త నష్టములు వచ్చును. రాజధానిలోని విద్యార్థులు మద్రాసులో గుమిగూడుటచే దేశైక్యము వర్ధమాన మయ్యెడిని. చూపు విస్తార మగుడు బుద్ధియు హృదయమును విస్తరించును. ప్రాంతతరహా చిన్నయూనివర్సిటీ యొండు మనమెడకు వ్రేలవేసి రేని, యూరోపియ నుపాధ్యాయుల సంఖ్య హెచ్చును; ఇఁకముందు మాతృభాషా విషయికదోహదములకుఁ బ్రయత్నించితిమేని, వారి సంఖ్య యనుల్లంఘ్యమైన విఘ్నకారక మగుట తప్పదు. నవీనరీతి సర్వకళాశాల లభ్య మయ్యెనేని దానికన్న మించిన భాగ్యము లేదు. ఇట్టిదానికి సరాసరికి సెలవును తక్కువ. ఔను గాని, సర్వకళాశాలల ననుసరించి యుపవిద్యాశాల లుండవలయును గదా! ఆమూలాగ్రముగ విద్యాశాలల నవరించుట సాధ్య మగునా? అగును. ఇట్లైన మనకు ప్రత్యేక

విద్యాధికారిని విద్యాదాయక ప్రకృతిని నిర్మింపవలయును గదా! అవును. విద్యావిషయమున నాంధ్రమండలము ప్రత్యేకింపఁబడవలయు నన్న, ఆంధ్రమండలము రాజధానులలో రాజధానిగఁ బరిణమించినఁగాని యగునా? సర్వకళాశాలోద్యమమును, ఆంధ్రమండలోద్యమమును, ఒండొంటితోఁ బెనగొనియున్న వని తోఁచెడిని; పరస్పరావలంబనము గలయవి. మద్రాసుతోఁ గలసియున్నంతకాలము విద్యాసంస్కారము అఘటమాన మని నా నమ్మిక. దేశశ్రేయస్కర మగు శిక్షాసంస్కరణమునకు ప్రత్యేకాంధ్రమండలనిర్మాణము అనివార్యకారణము గాకున్నను పరమసాహాయ్యకారి.

ఐరోపియనుల యభిమతము

ఇప్పు డుండు కళాశాలలే చాలు ననియు, నింక నెక్కువ యాసించుట తగ దనియుఁ గొందఱు ఐరోపియనులాక్షేపించెదరు. వీరి శత్రుత్వము తెలిసియే యున్నది; దానిని గూర్చిన చింత యేల? సహజ నిరోధకములలో నొకటి యని, తప్పించుకొనియో తొలఁగఁద్రోసియో, మన దారిన మనము పోవుచుండవలయు. ఈ యైరోపియనులు, ఇప్పుడు మనకు దక్కియుండు 'పాతికాపరక' విద్యాభోజనమే యెక్కువ యనియు, చెడ్డ యజీర్ణకారి యనియు, దీనిని గూడ నియ్యకుండిన నెంతో మే లనియు లోలోన కఠిన యోజనలఁ జేయుదురేమో! "గవర్నరు జనరలు మొదలగు పరమోన్నతపదవుల నుండువారు ఉదారచిత్తులై యూనివర్సిటీ విద్య ప్రసరింపఁజేయఁ బ్రయత్నించినను, వా రాదేశించు నీతుల నెవరు కొనసాగింపవలయునో యా యుద్యోగుల యౌదాసీన్యము కతన, ఆ గొప్పవారి కోరికలు సఫలములు గాకున్నవి" అని, మద్రాసు హైకోర్టు న్యాయాధిపతిమండలికి భూషణప్రాయులైన 'అబ్దుల్ రహీము' గారు తెగఁగోసిన ట్టిటీవలఁ బలికియున్నారు. 'ఎక్కువ యూనివర్సిటీల స్థాపించుట ముఖ్యకర్తవ్య' మని హార్డింజి ప్రభువుగారు మొగమోడక చెప్పి ఇండియా జనులకు హృదయామోద మొనర్చిరి. వారి పలుకు పండుగుఁగాక! ఒకవేళ నెక్కువ యూనివర్సిటీలను విధిలేక స్థాపింపవలసినవా రయ్యు, ప్రతియొక్కటిని "ఆక్సుఫర్డు" "కేంబ్రిడ్జి" లోనివానివలె ధనాధికులకు మాత్రము ప్రవేశింప సాధ్యములైనవానిఁ గా నొనర్చి, శాలల సంఖ్య హెచ్చినను బాలుర సంఖ్య హెచ్చకుండునట్లు, ఈ చిల్లరదేవతలు, "విద్యను సామాన్యము చేయఁగూడదు; అసమానగాంభీర్యముగా నొనర్పవలయును" ఇత్యాది నెపముల నేర్పుతోఁ బన్ని, కుయుక్తిఁ జేసి, హార్డింజిగారి మాట నిల్పినను, అభిమతార్థమును వ్యర్థముఁ జేతురేమో. జాగ్రత్త! వలలోఁ బడఁబోయెదరు సుడీ!!

ఆంధ్రజనబాహుళ్యముం బట్టి చూచినచో, ఆధునికరాజ్యసంప్రదాయముల ప్రకారము, తెనుఁగు దేశమున నొక్కటే కాదు, పది కళాశాలలున్నను అతిశయ

జన సంఖ్య; సర్వకళాశాలలసంఖ్య

దోషంబు ప్రాపింపదు. ‘కనడా’ యను బ్రిటిష్ మహారాజ్య చక్రమునకుం జేరిన దేశము మొన్నఁ బుట్టినది; వైశాల్యమున భరతఖండమునకన్న నెక్కువ; జనసంఖ్య యత్యల్పము; రమారమి ముక్కాలుకోటియ; ఆ వైశాల్యములో వీరు దూరదూరమున మిక్కిలి పలుచగ వెదఁజల్లఁబడియున్నారు; జనబహుళపట్టణములు కొన్ని యున్నవి; కాని జనబహుళజనపదములు (జిల్లాలు, తాలూకాలు) మందునకైన లేవు; పట్టణముల వదలి పది మైళ్ళు పోయినను జాలును, మన పురాణముల ప్రకారము కలికాలములో సత్యసంధు లెంతయరుదో, మనుష్యులే యచ్చట నంత యరుదు! అట్టి వివిక్తరాష్ట్రంబున నుండు సర్వకళాశాల లెన్ని యనుకొంటిరి! సుమారు ఇరువది! ముక్కాలు కోటిజనమునకు ఇరువది కళాశాలలు! ముప్పదిమూఁడు కోట్ల భారతీయులవిద్యాతృష్ణానివారణార్థమై జ్ఞానపుష్పవర్షముఁ గురియించు నిక్కడి సర్వకళాశాలల సంఖ్య ఐదు! వారికి నౌషధప్రాయమైన సర్వకళాశాలాగుణసంఖ్యాభివృద్ధి మన కేలవిషప్రాయ మగునో? ఈ విచిత్రరహస్యమును మనల నాక్షేపించు యూరోపియనులు గురూపదేశముఁ జేసి వెల్లడిపఱుతురా? ఈ క్రింది పటమున పరిమిత ధనోపేతము లగు కనడా, ఆస్ట్రేలియా లను క్రొత్త బ్రిటీషురాజ్యములను గూర్చిన యంకె లున్నవి. యథాక్రమముగాఁ జూచిన మన కెన్ని యూనివర్సిటీలుండవలయునో వీనిచే విశద మగును:—

కనడా

	మండలములు	జనసంఖ్య	సర్వకళాశాలా సంఖ్య	విద్యార్థి సంఖ్య	ఉపాధ్యాయ సంఖ్య
1	న్యూబ్రన్స్విక్కు	351,889	2		
2	నోవస్కోషియా	492,338	4		
3	క్విబెక్కు	2,003,232	4		
4	అంటేరియో	2,523,274	4		
5	మానిటోబా	455,614	1	850	16
6	సేస్కట్చివాను	492,432	1	500	18
7	ఆల్బెర్టా	374,863	రాజ్యస్థాపితము 1, ప్రజా ,, 1	488	11
8	బ్రిటిష్కొలంబియా	398,480	1 ఇంకను ప్రారంభదశ; స్థాపితముగా లేదు		

ఆస్ట్రేలియా

	మండలములు	జనసంఖ్య	సర్వకళాశాలా సంఖ్య	విద్యార్థిసంఖ్య	ఉపాధ్యాయుల సంఖ్య
1	న్యూసౌతువేల్సు	1,646,734	1	1,407	114
2	విక్టోరియా	1,315,551	1	1,129	79
3	క్వీన్స్లాండ్	605,813	1	83	10
4	సౌతుఆస్ట్రేలియా	408,558	1	780	38
5	వెస్టరన్ఆస్ట్రేలియా	284,114	1	200	12
6	టాస్మానియా	191,291	1	147	8

'కాల్గేరీ' యను కనడాయందలి చిన్న పట్టణము, ఒక్కయూనివర్సిటీ చాల దని యింకొకదానిని స్థాపింప మొదలిడినది. "అయ్యో! ముక్కాలు కోటి మంది యుండు దేశములో నిన్ని మహాశాల లున్నవే! ఇంకెట్లబ్బా! ప్రళయము తేపా మాపా?" యని గుండెలు చీల్చుకొను మహాత్ములు పశ్చిమదిక్కున దొరకరు. "నూతనసర్వకళాశాలలను నిలిపితిమేని, తగినంత గొప్ప సంఖ్య విద్యార్థులు వత్తురా?" యని కొంద ఱాక్షేపింతురు. దీనికి సమాధాన మేమి? "మీరిచ్చు విద్యలను బట్టియు, బోధకపద్ధతులను బట్టియు నుండు" ననుట. సార్థకవిద్యలను సులభగ్రాహ్యములగు విధమ్మున నేర్పుదురయేని, బాలికలు, బాలకులును తండోపతండములుగ వచ్చి ముట్టడింతురు. ఇప్పటి రీతిని, హృదయశూన్యుల, మనశ్శూన్యుల, కార్యశూన్యుల నొనరించు పద్ధతుల సింహాసనస్థములఁ జేసితిరేని ఎక్కువమంది రారు; వచ్చినను బనికిరారు. "టొరాంటో" యను కనడాలోని యొక్క యూనివర్సిటీకి మాత్రము చేరిన విద్యార్థుల సంఖ్య నాలుగువేలు! మనలో నిప్పటికే యధికసంఖ్యలు మద్రాసును ముట్టడించుచున్నా రని యెంచువారికి వేఱు ఖండన మేల? ముక్కాలుకోటి జన ముండు కనడాయందు సర్వకళాశాలలకుం జేరినవారి మొత్తము సుమారు పదునొకండు వేలు!

విద్యావర్గములు

ఈ విషయ విచారణము సుగమము గావలయునన్న విద్యలలోని జాతులఁగూర్చి యించుక చర్చించుట యావశ్యకము. ప్రథమభేదము శాస్త్రములని, కళలని. శాస్త్రములు ద్వివిధములు: మానుషములు, ప్రాకృతములు. మానుషములు: తర్కము, తత్త్వము, చరిత్రము, భాష, సంఘశాస్త్రము, మనుష్యశాస్త్రము, నీతి (రాజ్యపరిపాలనము, రాజ్యనిర్మాణము), అర్థశాస్త్రము మొదలగునవి. ప్రాకృతములు: ప్రకృతి, రసాయన, జీవ, వృక్ష, భూగర్భ, భూగోళ, ఖగోళ శాస్త్రాదులు — ప్రకృతిని పరిశోధించి తద్వ్యాప్తిన్యాయముల నెఱుఁగఁజూచునవి. మొదటియవి కళలయం దుపయోగింపఁబడఁజాలవు గావున 'అప్రయోజ్యములు' అని పేరు దాల్చినవి. ఈ రెండు తరగతులును శాస్త్రములు. వీని యుద్దేశము జ్ఞానవైశద్య వికాసములే తప్ప, వ్యాపారపారీణత, కళానైపుణి మొదలగు కార్యసంబంధశూరత్వము గాదు. ఐనను ప్రకృతి శాస్త్రములు కార్యప్రయోజ్యములు. మానుషములకు అలంకారవిద్య లనియు, నాణెపు విద్య లనియు పాశ్చాత్త్యులలో చాలకాలమునుండి వచ్చిన పేర్లు; నాగరకరీతిని పెంచునవి గాన. కళాప్రయోగసంబంధము గలవిగా చర్చింపఁబడని ప్రకృతి శాస్త్రములకు శుద్ధ శాస్త్రము లని

పాశ్చాత్త్యనామకరణము. శుద్ధము లనఁగా వట్టి వని యర్థము; కళలయందు ప్రయుక్తములు కాని భంగి; అప్రయుక్తములై యున్నట్లు; అనుట. నిర్మలము, పుణ్యము, శుభ్రము మొదలగు నర్థములిటఁ బనికిరావు. ఈ అప్రయుక్తప్రకృతిశాస్త్రముల సైతము నాణ్యపు విద్యలలో గ్రహించుటయుఁ గలదు. ఏలన, కళాప్రయుక్తములు గావేని యవియు జీవయాత్రకుఁ బనికిరావు; అనఁగా గుమాస్తా పని మొదలగు గవర్నమెంటు వారియొక్కయు ప్రాఁతబల్లయొక్కయు సేవనము దప్ప స్వతంత్రమార్గముల ననుట. మానుషములు శుద్ధముగ నప్రయోజ్యములు; అనఁగా కలెక్టరు కచ్చేరీలమీఁదఁ దప్ప వేఱెద్దానియందును బ్రయోగింపఁగానివి. ప్రకృతిశాస్త్రములు, కళాప్రయుక్తములుగ నైనను తత్సంబంధము లేని విధమున నైనను పఠింపఁబడవచ్చును.

కళలు

ప్రకృతి శాస్త్ర శోధనముచేఁ గనుఁగొనఁబడిన న్యాయములను ప్రకృతిమీఁదనే ప్రయోగించి మనుష్యులకు నెక్కువ ప్రయోజనకారిగా చేయునది కళ. ప్రకృతిశక్తులను యంత్రాదుల ద్వారా బంధింపవలయును. కళలలో రెండు విషయము లున్నవి. (౧) ప్రకృతిశక్తులయు న్యాయములయు జ్ఞానము (౨) వీనిం బ్రయోగించుటకై చేయవలసిన నిర్మాణము, పరిశ్రమము, ఈ ప్రయోగముల వివరించు శాస్త్రములకు 'ప్రయుక్తశాస్త్రము' లని పేరు. అనఁగా కళాప్రయుక్త ప్రకృతిశాస్త్రము లని నిర్వచనము.

ఇటను న్యాయవిచారణపై దృష్టి పోవును గాని, యంతకన్న నెక్కువగ దాని నేరీతిని ప్రయోజనార్థము ప్రయోగింపవలయు ననుటపైఁ బోవును; అనఁగా శాస్త్రములు కళాసంబంధములుగా చర్చింపఁబడును. ప్రయుక్తశాస్త్రములకుఁ జేరునవి—— జీవయాత్రకుఁ గావలసిన సమస్తకార్యములును సిద్ధులును! (౧) ఇంజనీరింగు. (ఇది సాధారణముగ చతుర్విధంబు: రోడ్లు మొదలగునవి, యంత్రములు, విద్యుచ్ఛక్తి, గనులు, వీనికిం జేరిన నిర్మాణములు. ఈ నాల్గింటిని చతుర్విధవాస్తువు లని మొత్తముగ సూచింపనగు.) (౨) రసాయనశాస్త్రప్రయోగములు : రంగులు, చర్మములఁ దయారుచేయుట, సబ్బులు, ఇత్యాదులు లెక్కలేనివి. (౩) వ్యవసాయము. (౪) వైద్యము. (౫) గృహాసంబంధికళలు : వండుట, భోజ్యవస్తుగుణములు, ఆరోగ్యము మొదలగునవి. కాలవైరుధ్యముఁ జెందని యూనివర్సిటీలలో ప్రయుక్త శాస్త్రములు పట్టాభిషిక్తములై యున్నవి. కాలవిపరీతములలో మానుషములు దట్టములు. ఇంతకన్న విపులముగ నీవిషయములఁ జర్చింపఁ గాదు. వేయి సిద్ధాంతము లైనను ఒక్కవృత్తాంతముతో సరిపోలవు. కాన నివిగో! వృత్తాంతములు.

పాశ్చాత్త్య సర్వకళాశాలలలో తత్తద్వ్యాపారములు గజిబిజి లేక నడచుటకై, ప్రత్యేకాంగముల నేర్పఱచి, వానియందలి యుపాధ్యాయ మండలికి నధ్యక్షులను వేర్వేఱ నియమించియున్నారు. ఈ యంగములఁ బట్టి చూచిననే సర్వకళాశాలల యపార వ్యాపారముల వృత్తము స్ఫురించును. *

ఆధునిక సర్వ కళాశాలా ప్రకృత్యంగ వృత్తాంతములు

బర్మింగ్‌హాము:— (అ) డిగ్రీ లిచ్చు ప్రకృతులు (1) వాణ్యపు శాస్త్రములు (భాషాదులు) (2) ప్రకృతిశాస్త్రములు (3) వైద్యము (4) వాణిజ్యము, శిక్ష (విద్యాబోధకకళ), వ్యవసాయము, ఇత్యాదికళలును, వ్యాపనవ్యాపారమును అనుగ్రహింపఁబడియున్నవి. ప్రయుక్తశాస్త్రమునకుఁ జేరిన కళలు:— గనులు, లోహములు, ఇంజనీరింగు (విద్యుదాదులు). సంఘసంస్కారము నొక విద్య!

(ఆ) విద్యావ్యాపనవిషయములు:—ప్రకృతిశాస్త్రము, రసాయనశాస్త్రము, జంతు, వృక్ష శాస్త్రములు, గనులు, లోహములు మొదలైన కళలు, సంగీతము, గృహనిర్మాణము, ఇత్యాదులు.

కేంబ్రిడ్జి:—(అ) డిగ్రీపాఠములు:—మనుష్యశాస్త్రము, భాషలు, అర్థశాస్త్రము, చరిత్రము, గణితము, తత్త్వము, ప్రకృతిశాస్త్రములు, యంత్రశాస్త్రములు, న్యాయము, ప్రాచ్యభాషలు.

(ఆ) డిప్లొమా ఇత్యాది డిగ్రీలకన్న తక్కువ బిరుదముల పాఠములు:—పైఁజెప్పినవియు, వ్యవసాయము, ఆరోగ్యము, శిక్ష, మొదలగునవి. డిగ్రీలలోఁబలె అంతయెక్కువ పరిశ్రమ మిందనావశ్యకము.

* ఇందలి విషయములు, అంకెలు మొదలగునవి తఱుచుగ 1912-13 వ సంవత్సరపు వృత్తాంతము లాధారములుగఁ గలయవి.

(ఇ) విద్యావ్యాపనము:— ఉపాధ్యాయుల సంఖ్య 25; స్కూళ్లను స్థాపించిన స్థలముల సంఖ్య 60; ప్రసంగముల వినుటకు వచ్చినవారి సంఖ్య 9,630; ప్రసంగానంతరము ఒకగంట నడపఁబడు క్లాసులలో క్రమముగఁ జేరినవారి సంఖ్య 2,402.

లీడ్సు:—(అ) డిగ్రీప్రకృతులు:—(1) 'మానవ' శాస్త్రములు (అర్థశాస్త్రము, వాణిజ్యము, న్యాయము, శిక్షయుఁ గలసి); (2) వైద్యము; (3) ప్రకృతిశాస్త్రములు; (4) ప్రయుక్తశాస్త్రములు (కళలు)—ఇందుఁ జేరినవి వ్యవసాయము, లోహములు, నలుదెఱంగుల ఇంజనీరింగు మొదలగునవి; పూర్వనివేదితములు.

(ఆ) డిప్లొమాప్రకృతులు:— (1) ఆరోగ్యశాస్త్రము. (2) పండ్ల (నోటిలోనివి) శాస్త్రము.

(ఇ) విద్యావ్యాపనము:—పైనివి ఒక్క వ్యవసాయమునకు మాత్రము:— బోధకుల సంఖ్య: 9; స్కూళ్ళు: 10; వ్యవసాయ ప్రసంగములు: 370; అవి యీయఁబడిన స్థలములు: 70.

మెక్‌గిల్, కనడా:—(అ) డిగ్రీప్రకృతులు:—(1) వాణ్యపుశాస్త్రములు. (2) న్యాయము. (3) వైద్యము. (4) ప్రయుక్తశాస్త్రములు. శుద్ధప్రకృతిశాస్త్రములు మొదటిదానియందిమిడియున్నవి. (5) వ్యవసాయము.

(ఆ) డిప్లొమాప్రకృతులు: (1) వాణిజ్యము. (2) గృహకళలు. (3) శిక్ష. (4) సంగీతము. (5) రణవిద్య.

(ఇ) ప్రయుక్తశాస్త్రాంగములు:—గృహనిర్మాణము, రసాయనశాస్త్రప్రయోగములు, లోహములు, రైల్వేయానములు, అఱు విధముల ఇంజనీరింగు (రసాయనము, లోహములు గలిసి), ఆరోగ్యము, దంతచికిత్స, వ్యవసాయగృహకకళల స్వల్పకాలపాఠములు, మొదలగునవి.

(ఈ) విద్యావ్యాపనము:—అమెరికాఖండములో నీపని ప్రాణసమానముగ నెన్నఁబడుచున్నది. విశేషించి చెప్పనేల!

మాంచెస్టరు:—(అ) డిగ్రీప్రకృతి: (1) అప్రయోజ్య విద్యలు. (2) ప్రకృతిశాస్త్రములు. (3) మతము. (4) న్యాయము. (5) వైద్యము. (6) సంగీతము. (7) ప్రయుక్తశాస్త్రములు. (8) వాణిజ్యము.

(ఆ) డిప్లోమాప్రకృతి: (1) దంతచికిత్స. (2) శిల్ప. (3) ఆరోగ్యము. (4) ఓషధులు మందులు తయారుచేయుట. (5) ప్రయుక్తశాస్త్రములకుఁ జేరిన యేడు కళలు. (6) సంఘసంస్కారవిద్య.

(ఇ) ప్రయుక్తశాస్త్రములు:—ఇంజనీరింగు (అన్ని వర్గములు), రసాయనశాస్త్రప్రయోగములు (రంగులు పట్టించుట మొదలగునవి), ఆవేశన (ఫ్యాక్టొరీల) పద్ధతులు, ఆరోగ్యము, రైల్వే యేర్పాటులు.

(ఈ) విద్యావ్యాపనప్రకృతి.

మానిటోబా (బాలశాల) కనడా:— (అ) డిగ్రీప్రకృతి:—(1) అలంకారవిద్యలు. (2) ప్రకృతిశాస్త్రములు. (3) న్యాయము. (4) వైద్యము. (5) ఇంజనీరింగు. (6) వ్యవసాయము (ప్రారంభదశలో నున్నది).

(ఆ) డిప్లోమాప్రకృతి:—వాణిజ్యము.

(ఇ) వ్యాపనప్రకృతి.

ఆక్స్‌ఫర్డు:—(అ) డిగ్రీప్రకృతి:—(1) నాణ్యపువిద్యలు. (2) ప్రకృతిశాస్త్రములు. (3) మతము. (4) న్యాయము. (5) వైద్యము. (సంగీతము, శిల్ప, మొదటిదానియందును, ఆరణ్యకము ప్రకృతిశాస్త్రమునందును జేర్పఁబడియున్నవి.)

(ఆ) డిప్లోమాప్రకృతి:—పైఁజెప్పినవానిలోని భాగములు. (మనుష్యశాస్త్రము, అర్థశాస్త్రము, ఆరోగ్యము, నేత్రవైద్యము, శిల్ప, ఆరణ్యకము, ఇంజనీరింగు.)

ప్రయుక్తశాస్త్రములు ఇక్కడఁ గాని కేంబ్రిడ్జియందుఁ గాని ప్రముఖములు గావు. ఈ విషయమున నీ యూనివర్సిటీలు శా[illegible]

సారములు గావు; వెనుకఁబడినవి. అయినను మనయంత దూరమునఁ గాదు.

(ఇ) వ్యాపనము:— ప్రారంభింపఁబడిన సంవత్సరము 1878 (కేంబ్రిడ్జికన్న నొకయేఁడు వెనుక). 33 ఏండ్లలో (1911 వఱకు) హాజరు విద్యార్థుల సంఖ్య: 510,000. ఇందు పరీక్షించి యోగ్యతాపత్రముల నిచ్చుటయుఁ గలదు. 1912-వ సంవత్సరపు లెక్క:— స్థలములు: 125; ప్రసంగములు: 1,345; హాజరైన విద్యార్థుల సంఖ్య: 14,130; ఉపాధ్యాయులు: 40.

టొరాంటో, కనడా (ప్రౌఢశాల):—(అ) డిగ్రీప్రకృతి:— (1) నాణెపువిద్యలు (ప్రకృతిశాస్త్రములు గలసి) (2) వైద్యము (3) ప్రయుక్తశాస్త్రములు (ఇంజనీరింగు కలసి) (4) శిల్ప (5) ఆరణ్యకము (6) గైహికము (7) వ్యవసాయము, పశుచికిత్స. (శాఖాశాల యొండున్నది. అందు)

(ఆ) ప్రయుక్తశాస్త్రాంగములు ఏడు:— గృహనిర్మాణము; రసాయనశాస్త్రకళలు; ఐదు విధముల ఇంజనీరింగు (రసాయనవాస్తువులతో). ఇతరపాఠములు:—దంతచికిత్స; సంగీతము; ఔషధములఁ దయారుచేయుట.

(ఇ) విద్యావ్యాపనము:— అమెరికా మామూలు మేరకు!

విస్కాన్‌సిన్, అమెరికా:—(అ) డిగ్రీప్రకృతి:— (1) అలంకారవిద్యలు (శుద్ధప్రకృతిశాస్త్రములతోడ). (2) ఇంజనీరింగు. (3) న్యాయము. (4) వ్యవసాయము. (5) వైద్యము. (6) పట్టపరీక్షానంతరవిద్యాకృషి.

(ఆ) విద్యావ్యాపనము.

(ఇ) వేసవికాలపు సెలవులలో నడపఁబడు విద్యాబోధనము. (క్రమవిద్యార్థులకుఁ గాదు; గ్రామపాఠశాలోపాధ్యాయులు మొదలగువారికై.)

చికాగో, అమెరికా (అతిప్రౌఢము), అంగములు:—
(1) తత్త్వము (మనశ్శాస్త్రము, శిక్ష కలిసి) (2) అర్థశాస్త్రము (3) రాజనీతి (4) చరిత్రము (5) అలంకారకళలు (చిత్తరువులు మొదలైనవి) (6) సంఘశాస్త్రము, మనుష్యశాస్త్రము (7) గార్హికకళలు (8) వివిధమతములఁ బోల్చి పరిశీలించుట (9) సంస్కృతము, హిందూదర్శనములు (10) వివిధభాషలు (11) గణితము (12) ఖగోళశాస్త్రము (13) ప్రకృతి (14) రసాయన (15) భూప్రకృతి (16) భూగోళ (17) జంతు (18) శరీరనిర్మాణ (19) శారీరక (20) వృక్ష (21) వ్యాధికారణ సూక్ష్మజీవ ప్రభృతి శాస్త్రములు (22) దేహకృషి (కుస్తీ, ఈఁత, మొదలగునవి).

వసీడా, జపాను:—(అ) డిగ్రీప్రకృతి: (1) జపానీయ వాఙ్మయము (2) చతుర్విధమగు ఇంజనీరింగు (3) వాణిజ్యము (హాజరువారి సంఖ్య సుమారు 1000!) (4) శిక్ష (5) ప్రయుక్తశాస్త్రములు, కళలు (6) ప్రకృతిశాస్త్రములు. (ఆధునిక విషయములంగూర్చి జపానుభాషలో వ్రాయించి ఈ యూనివర్సిటీ ప్రచురించిన గొప్ప గ్రంథముల సంఖ్య దాదాఁపు 200!)

(ఆ) విద్యావ్యాపనము.

టోకియో, జపాను:—(అ) డిగ్రీప్రకృతి: (1) న్యాయము (2) వైద్యము (3) ఇంజనీరింగు (4) జపానీయవాఙ్మయము.

ఫిలిపీన్ దీవులు:—అంగములు: (1) శుద్ధవిద్యలు (ప్రకృతిశాస్త్రములలో) (2) వైద్యము (3) వ్యవసాయము (4) పశుచికిత్స (5) ఇంజనీరింగు (6) న్యాయము (7) అరణ్యకము (8) చిత్రకళలు.

ఇట్లు వివిధశాలల వ్యాపారములను అంగములను బరిశీలించుటచేఁ దేలిన విషయము లివ్వి:—

(1) అలంకారవిద్యలకన్న కళాప్రయుక్తశాస్త్ర

ములకు ప్రవేశ మెక్కువ.

(2) శుద్ధ శాస్త్రములును కళలును ఏకశాలయందే నేర్పఁబడును.

(3) శిక్ష (బోధకకళ) పట్టపరీక్షకుం జేరిన పాఠములలో నొకటి.

(4) తమతమ దేశముల స్థితిగతుల గమనించి, వానికిం దగినట్లు కళాశాలా వ్యాపారములు నిర్ణయింపఁ బడియున్నవి.

(5) వ్యవసాయము అన్నిటను ప్రత్యక్షము.

(6) గార్హికకళలు తఱుచుగఁ జేర్పఁబడియున్నవి. పురుషులకు మాత్రము విద్య నేర్పినయెడల సంఘము, ఒంటికంటితోఁ జూచునదియు, నొంటిచేతఁ జేయునదియు, నొంటికాల నడుచునదియు నై, అంగవైకల్యమును చిత్తశుష్కత్వమును బ్రాపించిన దగును. స్త్రీవిద్యావిషయమైన హిందూదేశక్షోభకు మద్రాసు యూనివర్సిటీ కాదు హేతువు. మఱి యే యూనివర్సిటీయుఁ గాదు. మన దురాచారములే. ఈ లోపమునకు చికిత్సఁ జేయ నన్యుల కసాధ్యము. అట్లనుటచే మనకు సాధ్య మని యనుమానించుటయు నిరాధారము! నాయర్థ మే మనఁగా, అయిన మనవల్లఁ గావలయును; లేనియెడల నేఁజాడను గాఁజాలదు.

(7) యూనివర్సిటీ విద్యచే స్వతంత్రవ్యాపార

శక్తి హెచ్చును. గవర్నమెంటే గతి, దిక్కు, మోక్షము, తల్లి, తండ్రి, గురువు, దైవము నని నమ్మి ప్రభుత్వ భాగవతులమై యుండనక్కఱలేదు.

(8) డిగ్రీకే కాక దానికన్నఁ దక్కువ బిరుదములకు నేర్పాటు లున్నవి.

(9) పగలు వృత్తులలోఁ జేరి పరిశ్రమించు వారికై సాయాహ్నముల పాఠములు నడపఁబడును.

(10) విద్యావ్యాపనము అన్నిఁటఁ బ్రసిద్ధము. ఆక్సుఫర్డు, కేంబ్రిడ్జి యను పురాణశాలలును ఈ కార్యము ననుగ్రహించియున్నవి. ఇఁక సనాతనధర్మ మనుట కేమి సందేహము ?

ఇంకను అనేకవిషయములఁ జదువరు లెఱుంగక పోరు. ఇఁక నయ్యావిద్యల నభ్యసించు విద్యార్థుల సంఖ్యలఁ బరికింతము:—

ఫిలిప్పీను దీవులు:—

(1) అలంకారవిద్యలు (ప్రకృతిశాస్త్రములతో)	200
(2) వైద్యము	73
(3) వ్యవసాయము	253
(4) పశుచికిత్స	27
(5) ఇంజనీరింగు (ప్రారంభదశ)	5
(6) న్యాయవాదిత్వము	146
మొత్తము	704

నూటికి నేఁబదిమంది కళాప్రయుక్తశాస్త్రపాఠ

కులు. ప్రకృతిశాస్త్రములఁ జదువువారిని ప్రయోజకులలోఁ జేర్చినచో నలంకారవిద్యావాచకుల సంఖ్య నూటికి ముప్పదికన్న మీఱదు.

విస్కాన్సిన్:—

(1) అలంకారవిద్యలు (శుద్ధప్రకృతి శాస్త్రములతో)	471
(2) కళాశాస్త్రములు	678
(3) వ్యవసాయము	1,289
(4) వైద్యము	108
(5) తదితరములు (గృహకాదులు)	243
మొత్తము	2,889

శుద్ధప్రకృతి శాస్త్రములను ఆలంకారిక విద్యలను జదువువారు 100-కి 16 గురు మాత్రమే. ప్రకృతిశాస్త్రాధ్యాయులఁ దీసివేసిన 'మానుష' శాస్త్రపాఠకులు నూటికి నారుగురైన నుండరు.

బర్మింగ్‌హాము:—

(1) ఆలంకారికవిద్యలు	251
(2) ప్రకృతిశాస్త్రములు	117
(3) ప్రయుక్తశాస్త్రములు	176
(4) వైద్యము	92
(5) తదితరకళలు	177
(6) కొంతకాలము మాత్రము వచ్చువారు	150
మొత్తము	948

అనఁగా నూటికి ముప్పది తొమ్మండ్రుగురు మాత్రము పరశుపరిశుద్ధజ్ఞానము వడసినవా రనుట.

బ్రిస్టల్, ఇంగ్లాండు (ప్రారంభదశ):—

(1) ఆలంకారికవిద్యలు	40
(2) ప్రకృతిశాస్త్రములు	76
(3) ప్రయుక్తశాస్త్రములు	64
(4) వైద్యము	36
(6) తదితరములు	44
(7) సాయాహ్నకాలవిద్యార్థులు	552
మొత్తము	812

నూటికి పదునాల్గురు మాత్రము శుద్ధవిద్యవారు! తక్కినవారు ప్రయోజకవిద్యలవారు.

లీడ్సు:—

(1) వైద్యము	147
(2) అలంకారము (ప్రకృతిశాస్త్రములతో)	893
(3) సాయాహ్నకాల విద్యార్థులు	208
(4) కొంతకాలము మాత్రము వచ్చువారు	84
మొత్తము	1,834

ఇందు శుద్ధవిద్యలవారు సుమారు 150 మంది మాత్రము. అనఁగా నూటికి పదునొకండు మంది.

లివర్పూల్:—

(1) డిగ్రీడిప్లోమాలవారు	849
(2) పట్టపరీక్షానంతరవిద్యార్థులు	107
(3) కొంతకాలము (డిప్లోమా) వారు	116
(4) సాయాహ్నకాల విద్యార్థులు	316
(5) తదితరవిద్యార్థులు	151
మొత్తము	1,539

శుద్ధవిద్యలవారు సుమారు 200 మంది—అనఁగా 100-కి, 13 గురు

మాంచెస్టరు:—

(1) డిగ్రీడిప్లోమాలవారు	1,117
(2) కొంతకాలము వచ్చువారు	237
(3) సాయాహ్నమువారు	201
మొత్తము	1,615

ఇందును అలంకార విద్యావినోదుల సంఖ్య మిక్కిలియు నల్పము.

మెక్‌గిల్, కనడా (ప్రౌఢశాల):—

(1) అలంకారవిద్యలు(ప్రకృతిశాస్త్రములు గలిసి)	390
(2) ప్రయుక్తశాస్త్రములు, కళలు	500
(3) వైద్యము	300
(4) న్యాయవాదిత్వము	60
(5) గైహికము	67
(6) వ్యవసాయము	98
(7) శిక్ష (విద్యాబోధనము)	180
(8) ఖండకాలికులు	170
మొత్తము	1,765

అలంకార న్యాయవాదిత్వ వర్గములు గలిసి "అప్రయోజకుల"సంఖ్య 100 కి 26

టొరాంటో, కనడా (ప్రౌఢశాల):—

(1) అప్రయోజ్యాప్రయుక్తములు	1,629
(2) ఖండకాలికులు	284
(3) దంతచికిత్స	60

(4) పశుచికిత్స	186
(5) వైద్యము	593
(6) ప్రయుక్తశాస్త్రములు	680
(7) శిక్ష	350
(8) గైహికము	104
(9) ఆరణ్యకము	44
మొత్తము	3,885

అలంకారవిద్యలవారి సంఖ్య నూటికి నలువది రెండు; ప్రకృతిశాస్త్రజ్ఞులఁ దీసివేసినచో నప్రయోజ్యములవారి సంఖ్య నూటికి నిరువది యుండిన హెచ్చు.

మద్రాసు యూనివర్సిటీ

ఇకఁ మన మద్రాసు యూనివర్సిటీలోని యుదంతంబులఁ జింతింతము.

(అ) డిగ్రీప్రకృతులు:—(1) అలంకారవిద్యలు (ప్రకృతిశాస్త్రములతోఁ గూడి) (2) న్యాయవాదిత్వము (వ్యాధిత్వము!) (3) వైద్యము (4) ఇంజనీరింగు (రెండు విధములు మాత్రమే).

డిప్లోమా, విద్యావ్యాపనము మొదలగు నూతన ప్రచారము శ్రీ పవిత్రసరస్వతికి సరిపడవు. శిక్ష యున్నది గాని యది పట్టపరీక్షానంతర సేవ్యము. ప్రయుక్తశాస్త్రములు, కళలు, శుష్కజీవితములై యున్నవి.

1914-వ సం. పట్టపరీక్షాపాఠకుల సంఖ్య ప్రకారము.

బి. ఏ. క్రొత్త యేర్పాటు:—

(1) ప్రకృతిశాస్త్రములు	196
(2) భాష, చరిత్రము, తత్త్వము	404
(నిష్కళంకవిద్యలు!) మొత్తము	600

ఇందులో చారిత్రకుల సంఖ్య మాత్రము 326! ఈశ్వరా!! భాషాద్యప్రయోజ్య విద్యలవారి సంఖ్య: నూటికి 66!! పై 600 గురును కళాసంగము లేని కలెక్టరుకచ్చేరి కాఁపుదలవా రనుట మాత్రము మఱవకుఁడు!

బి. ఏ. ప్రాంతయేర్పాటు:—

(1) తత్త్వము, చరిత్రము	428
(2) ప్రకృతిశాస్త్రములు	249

తాత్త్వికచారిత్రకుల సంఖ్య నూటికి 61; ఇరు విద్యలును అప్రయుక్తములు!

(3) న్యాయశాస్త్రము (దేవుఁడే గతి!)	1,137
(4) శిక్ష (ప్రాఁత, క్రొత్త)	151
(5) వైద్యము	269
(6) ఇంజనీరింగు	57

1914-న సంవత్సరము పట్టపరీక్షకు విజయం చేసిన వారిలో:

అప్రయుక్తవిద్యలు:—

(1) భాష, తత్త్వము, చరిత్రము నవలంబించినవారి సంఖ్య	832
(2) ప్రకృతిశాస్త్రములు	653
(3) న్యాయవాదిత్వము	1,137
మొత్తము	2,622

కళాప్రయుక్త విద్యలు:—

(1) శిక్ష	151
(2) వైద్యము	269
(3) ఇంజనీరింగు	57
మొత్తము	477

1914-వ సంవత్సరము పట్టపరీక్షకు విజయం చేసినవారిలో:— ప్రయుక్తాప్రయుక్త విద్యాపాఠకుల సాదృశ్యము 18 కి, 100 కి నుండునంత! శిక్షను అప్రయుక్తములలోఁ గలిపినచో ప్రయుక్తపాఠకులు 100 కి, 10½ మాత్రమే! శుద్ధముగ ననాదరణీయవిద్యలపాలైన యీయూనివర్సిటీవంటి మఱియొక యనర్థకయూనివర్సిటీని పూతగోదావరీతీరమున స్థాపింపఁజేసి, గవర్నమెంటుసేవను, తన్మూలముగఁ బ్రజల మీఁద నధికారమును జేయ నెంచినవారెంత కృతార్థులైనను, ప్రజల కేమి మేలు? పశ్చిమరాజ్యములు దినదిన ప్రవర్ధమానములుగ నుండుటకును మన రాజ్యము మన రాజ్యమువలెనే అనన్వయాలంకారమును విధిలేక ధరించి యుండుటకును గల హేతువులలో మన నిష్ప్రయోజక విద్యాదాయిప్రకృతి యొకటి. దేశమునకు మేలుగోరువారు ఈ పౌరాణికసర్వకళాశాలా ప్రతిబింబముల నాశింపరు. ఆశించిరేని, వారు ప్రజాక్షేమము నరయుచున్నారా, కచ్చేరీల నరయుచున్నారా, యను సందేహము దేశభక్తులకుఁ దట్టకమానదు.

ప్రకృత మిట్టి కళాశాల మన కనాపేక్షితము

ఇకముందు విద్యావ్యాపారములు మాతృభాషామూలముననఁ దప్ప నన్యథా ఘటింపనేరవు. ఆఫీసులు మన నోటఁ బడినచో, దేశము స్వాతంత్ర్యమును మహాభ్యుదయమును వహించు

మాతృభాష

ననువారు లేకపోలేదు; వారి యూహ మంచిది కాదనుటకై సుప్రసిద్ధులగు కొందఱి యభిప్రాయముల నివేదించెదను.

కవిశేఖరుండును విద్యాబోధన శాస్త్రపారీణుండును అగు సర్ రవీంద్రనాథ ఠాకూరు గారు పలికిన ప్రకారము:

రవీంద్రనాథ ఠాకూరుగారు

"దేశోద్ధరణార్థము విద్య నెల్లెడ వ్యాపింపఁజేయవలయును. సర్వజనులకును విద్య సాధ్యము గావలయు నన్న మాతృభాషమూలముగ నద్దాని బోధింపవలయును. బుద్ధి తక్కువచేతనో డబ్బు తక్కువచేతనో ఇంగ్లీషునందు విశేషపాండిత్యము సంపాదింపఁజాలనివారి కేల యుత్కృష్టతరవిద్య లగు బి. ఏ., ఎం. ఏ. పఠనీయము లందరానివిగ నుండవలయునో తెలియకున్నాఁడను. మాతృభాషలఁ దగిన పుస్తకములు లేవని కొందఱి వాదము; ఈ కఱవునకు కారణము యూనివర్సిటీలు దేశభాషలకుఁ జేసిన యపకృతి గాని వేఱొండు గాదు. వానికిని ప్రధానస్థానము నిచ్చిరేని గ్రంథప్రకటనము తనంతట నుద్భవ మగును."

మద్రాసు హైకోర్టు జడ్జి యగు అబ్దుర్ రహీము గారు సెలవిచ్చిన విధము:

అబ్దుర్ రహీము గారు

"శ్రీ రవీంద్రనాథ ఠాకూరు గారు మాతృభాషామూలక విద్యాభ్యాసము మంచిదనియు, మహనీయము లగు ప్రకృతి ప్రయుక్తాదిశాస్త్రములు తద్ద్వారా వెల్లడింపఁబడవలయు ననియు నిటీవల వక్కాణించిరి. అటువంటి మహామహుని మాట ననాదరణతోఁ జూడరాదు. ప్రకృతము దేశభాషలను చిల్లర విద్యలకు మాత్రము వాడెదరు. గొప్ప గొప్ప విద్యల సంగతి మారితేనే ప్రాచుర్యమునకుఁ దేనియెడల, ప్రజాబాహుళ్యమున నుత్కృష్టవిజ్ఞానము వృద్ధిఁజెందదు."

సర్ హేరోల్డు స్టూవర్టు గారు ఈ విషయ మింకను చక్కఁగా ప్రబోధించి రని నా యభిప్రాయము. మద్రాసు యూనివర్సిటీ బిరుదప్రదానోత్సవ కాలమ్మున, నట మూఁగిన విద్యాధికలోకమ్మును వీక్షించి యుపన్యసించుచు, మాతృభాషామూలమ్మున విద్యాబోధన లేనిది ఆధునిక శాస్త్రవిజ్ఞానము జనసామాన్యమునకు నలవడఁజాల దనియు, ఆక్సుఫర్డు కేంబ్రిడ్జులంబలె అప్రయోజ్యములు, అప్రయుక్తములు నైన యలంకార శాస్త్రములు మాత్ర ముపాసించుచుండుట కర్తవ్యముగా దనియు, లీడ్సు మాంచెస్టరు మొదలగు నూతనరీతి యూనివర్సిటీలు చూపిన దారిని మనముఁ బోవుట మంచి దనియు, ప్రయుక్తశాస్త్రాభ్యాసంబునఁ గాని దేశ మం దభివృద్ధి యడరసేర దనియు వచించిరి. మాతృభాష యొకటి యున్న మాత్రమునఁజాలదు; ఏభాష యెంత మాత్ర మున్నను జాలదు! ప్రకృతిశాస్త్రముల నీనాఁటికి నానాఁటికిఁ దేలు జ్ఞానమును విస్తరింపఁజేయుటకును, జనులలో వ్యాపింపఁజేయుటకును, ప్రయుక్తశాస్త్రములను కళలను బోధించుటకును, ప్రచారమునకుఁ దెచ్చుటకును, ననుగ్రహింపఁబడిననే కాని, తదేకధ్యానమునకై తేఁబడి ప్రతిష్ఠింపఁబడినయెడల, మాతృభాష శత్రు వగును. భాష యని కాదు మాతృభా

సర్ హేరోల్డు స్టూవర్టుగారు

షను గోరుట; ప్రకృతిప్రయుక్తశాస్త్రముల సర్వవ్యాప్తములుగాఁ జేయుటకు విధిలేని సాధన మని.

ఈ ప్రశంస యీవఱలోనే యధిక మయ్యెనేమో! ఏ నిందకైన నోర్చి సర్వకళాశాలలంగూర్చిన యీ కాలపుఁ దత్త్వములను ప్రకటించుట ముఖ్యకర్తవ్యము. "సర్వకళాశాలలు కావలెను, కావలెను" అని యాత్రముతో నాఁకలి కోర్వని విధంబున నఱచు మన నాయకులలో నెందఱకు దాని నిజమైన రూపంబు తెలియును? తుదకు వాసనమైన సోఁకియున్నది? మన దేశమున మనస్సునకు విశ్రాంతి యున్నను నాలుక కున్నట్లు గానము. ఏమియుఁ దెలియనివా రయ్యును "సర్వకళాశాలాస్థాపనమునకై కమిటీ నొం డేర్పఱుపఁబోయెదము. మిమ్ము నొకసభ్యునిఁగా గ్రహించెదము. వచ్చెదరా?" యని గవర్నమెంటువా రడిగిరేని, శంక జంకు దాల్చు నంతటి వినయశాలులు మన నాయకులలో నెందఱున్నారు? పిలువకమున్నే ససంభ్రమముగఁ బరువిడి పలువుర నాశ్రయించి పదవి నందుకొంద మనువారి సంఖ్య యెంత? యోజింపుఁడు. అట్లగుట నాబాలగోపాల మెల్లరకును గొంతకుఁ గొంతయైనఁ దెలిసిన, నిఁకముందు ప్రమాదము సంభవింప దను విశ్వాసముపై నీ వ్యాసము వ్రాసినాఁడను. "పండ్లు కావలయునా?" యని యొకఁ డడిగెనేని "మామిడిపండ్లా? బత్తాఁపు

పండ్లా?" యని గుఱితింపకమున్నే "ఇందు, తీసికొండు" నని ముందున కేగువారు మూఢులా, ప్రౌఢులా? ఎటువంటి యూనివర్సిటీ లభ్యమో యది తెలియకమున్నే యెట్లు వరింపఁగలము? ప్రాఁత పెద్దమ్మ యైనయెడల వలదు. సకలప్రజాభిరామనవ్యకళాశోభిత యైనయెడల సర్వమంగళ సన్నాహములతోఁ దెచ్చి దేశలక్ష్మిగ భావించి గౌరవించెదము.

PRINTED AT THE ANDHRAPATRIKA PRESS,—MADRAS.

విద్యాప్రవృత్తి

కట్టమంచి రామలింగారెడ్డి గారు

మనుష్యమూలాధార ప్రకృతులు రెండు: జ్ఞానము, కర్మము. జ్ఞాన మనఁగాఁ దెలివి; వస్తుస్వభావమును గనుఁగొనుట. కర్మ మనఁగా కార్యము; చేయు పని

వీనియం దెయ్యది ప్రధానము? జ్ఞానమా? కర్మమా? పర్యాయపదముల మూలముగ విచారించిన నీ విషయ మింకను విశదమగును. జీవితమున నాద్యమెయ్యది? బుద్ధియా? నడతయా? యోజనమా? చరితమా? నోటిమాటలా? చేతియాటలా?

సర్వముఁ దెలిసినవా రయ్యును మూఢులవలె, దుర్మార్గులవలె, వర్తించువారు లేరా? అపురూపులా? అట్టివారిని కృతకృత్యు లని యెవరైన శ్లాఘింతురా? మఱియు, నేమియుఁ దెలియనివా రయ్యును సన్మార్గమునఁ దమ నైజమును బట్టి పోవువారు నెందఱో యున్నారు; గ్రామములలో నుండు బీదసాదలు తఱుచు ధర్మనీతి తత్త్వముల నెఱిఁగినవారు గాకున్నను, వర్తనమునందు పండితులకన్న మొత్తముమీఁద శ్రేష్ఠు లని యనేకుల నమ్మిక. జనుల తారతమ్యము నిరూపించు

నప్పుడు చర్యలను గణింతుము గాని విద్యను గణింపము. మనలోఁ గొందఱు "సుజ్ఞాన మున్నఁ జాలును, సిద్ధులు చేకూరును" అని వచించెదరు. అది యెట్లో, నాకుఁ జక్కఁగ బోధపడమికిఁ జింతిల్లవలసి యున్నాఁడను. "ధైర్యగుణ మియ్యది, దాని లక్షణము లియ్యవి; తన్మూలమునఁ బ్రబలించు కార్యము లియ్యవి" యని, మంచి శైలిని, ఆమూలాగ్రముగ విచారణ నడపి, ప్రసంగింపఁగల వారందఱును ధైర్యమును నడతయందుఁ బ్రకటించుట నిత్యమా? జ్ఞానమును బడసిన మాత్రాన చరిత్రము చక్కఁబడునేని, హిందూదేశచరిత్ర మిట్లేల యున్నది? ఇది నిష్కారణ విచిత్రమా? జ్ఞానయోగముచేఁ బరలోకమున సర్వమంగళములు తటస్థించునఁట! అవునో కాదో నాకుఁ దెలియదు కాని, యొక్కటి మాత్రము సత్యము; వట్టి జ్ఞానము ఈ లోకమున నే సాధనకును బనికిరాదు. దీనిఁబట్టి చూడఁగాఁ బరలోకము మెత్తని దనియు, నోటిలోని వెన్నమాదిరి కరఁగునంత సరళ మనియు, సూక్ష్మ మనియు, నీ పాడు ఇహలోకమువలె కాఠిన్యము, పారుష్యము, స్థౌల్యమును లేని దివ్యపదవి యనియు, నెట్టి నమ్మిక లేనివానికైనను తటుక్కునఁ దట్టక మానదు. పరలోకదృష్టితో నీ విషయముఁ బరిశీలించుట యిట నప్రకృతము గావున సామాన్యదృష్టితో నారయుదము.

ఆద్యప్రకృతి కర్మంబు; (ఇటఁ గర్మం బనఁగా 'కర్మకాండ' మనఁబడుదానికిఁ జేరిన వైదిక క్రియ గాదు.) జ్ఞానము ద్వితీయము. ద్వితీయం బనుటచే గౌరవహీన మని భావించుట తప్పు. ముందు వచ్చిన చెవులకన్న వెనుక వచ్చిన కొమ్ములు వాఁడి కావా? జన్మాదిగా జ్ఞానశక్తి, పూర్వము కపిలుఁడు ఘటోత్కచుఁడు మొదలగువారికి సద్యోజ్ఞానమునఁ గూడ వచ్చినట్లు, ఈ కలియుగములో నెవ్వారికిని లభింపదు. కాని, పుట్టిన క్షణము గోలె నేవేని క్రియలు ప్రవర్తింప కుండినచోఁ బ్రాణములు నిలువవు. శిశువు పాలు ద్రావక సమాధిఁ దాల్చెనేని యది యోగమా? కాదు; ప్రాణత్యాగము. ప్రాణకార్యములు నిత్యసంయోగములు; ప్రాణము లున్నఁ గార్యములు, కార్యము లున్నఁ బ్రాణములు నుండియే తీఱవలయును. ప్రాణములు లేనిచోఁ గార్యములు, కార్యములు లేనిచోఁ బ్రాణములు నుండవు. కర్మమువలె జ్ఞాన మీరీతిని ప్రాణాధారము గాదు. పశు పక్షి వృక్ష సంతానములలో ప్రాణములును గార్యములును బలసియున్నను విద్య లున్నవా?

కార్యాచరణమునందలి యిక్కట్టులు సందియములు మొదలగు నడ్డంకులు, యోజనలు ప్రభవిల్లుటకు మూలములు గాకున్నను తరుణములు. ఏ కష్టమును లేక మనకు ఊపిరి యాడునట్లును, హృదయము గొట్టు

కొనునట్లును, స్వచ్ఛందముగా నిత్యసారళ్యముగఁ గార్యములు నడచునేని, ఏ యోచనకును అవకాశమును ఆవశ్యకతయు నుండవు. అట్లగుట నాలోచనలు పుట్టవు. పక్షిమృగముల జీవితములందు వ్యాపారములు మెండయ్యును చిక్కులేనివి. కొన్నిగతుల సంచారములచే అవి ప్రాణయాత్ర నీడేర్చికొనును. అట్లు మనుష్యజీవితము సుసాధము గాదు; మనల నావరించియుండు స్థితిగతులు సంఖ్యయందు మిక్కిలియు నధికములు, సంశ్లిష్టములు; ఎక్కువ చిక్కును దాల్చినయవి. కావున యోజనాశక్తి నేమాత్రమును బ్రయోగింపనియెడల మనకును మన సంతతికిని బ్రదుకు దక్కదు. మనుష్యజీవితము ఉత్కృష్టమును, శాశ్వతమునైన దశం జెందవలయు నన్న, విజ్ఞాన మఖండముగఁ బర్వవలయును. జ్ఞానయోగవాదులలోనుండు సత్యమింతయే కాఁబోలు! అయిన నొక జాగ్రత్త: విజ్ఞాన ముండిన మాత్రాన జన్మసాఫల్యము కలుగఁబోదు. ప్రకృతసిద్ధాంత మే మనఁగా, జన్మసాఫల్యమునకు ఆవశ్యకము లగువానిలో జ్ఞానము నొక్కటి యని. ఇంతకన్న నెక్కువ మాహాత్మ్యము నారోపించుట నిర్హేతుకము.

యోజనాశక్తియొక్క ముఖ్యోద్దేశము కార్యసాలభ్యము. కార్యములు దుర్ఘటములుగ నున్న, "నే రీతి నలవరించుకొన వచ్చును దైవమా!" యని భక్తియోగ

జ్ఞానయోగముల రెంటిని బ్రకటింతుము. కార్యములు సరసర మని నిర్విరోధముగ జరగుచుండెనేని, ఏ యోజనలు లేక నెమ్మదిగ నుందుము. చూడుడు; శిశువునకు ప్రాణము లెట్లు నిలుచును? పాలను గ్రోలుటచేత. ఈ ప్రాణాధారక్రియకుఁ గావలసిన జ్ఞాన మెయ్యది? స్తన్యము గుర్తెఱుఁగుట. శిశువులయం దింతకన్న జ్ఞాన మాదియందుఁ గానఁబడదు. త్రోవ తెలిసినవాఁడు, నడచుచుండుట నైన గమనింపక, పరచింతఁ దాల్చినవాఁడై, కాళ్లీడ్చికొని పోవఁ బోవుచుండును. తెలియనివాఁడు మాటిమాటికిని ద్రోవను గూర్చిన యోజనలకుఁ గడఁగుచుండును; నాలుగు దారులు గలసిన చోటికి వచ్చెనేని 'ఏదబ్బా, దిక్కు!' అని తల బ్రద్దలగునట్లు వితర్కించును. ఏ యుపాధులును లేక కార్యములు నడచునేని యోజనాశక్తికి 'రజా' యిచ్చినవారమై, శిరోభారపీడనము లేని జీవనముఁ బడయఁ జాలుదుము.

నాగరకత యెక్కువ యగుకొలఁది బ్రదుకుపాటుల స్థితిగతు లింకను చిక్కును దాల్చును. తళుకులు, బెళుకులు, కోరికలు, కష్టములు, సుఖములు, సాధ్యములు, అన్నియు హెచ్చును. అసాధ్యము లని యెన్నఁబడువాని సంఖ్య మాత్రము తగ్గును. పూర్వము దేవుఁడొసఁగిన రెండు కాళ్లతో నెల్లరును బ్రయాణములను

మెల్లఁగ, తిన్నఁగ, జరపుకొనుచుండిరి. ఇప్పటి యానోపాయము లెన్ని యని చెప్పవచ్చును! వ్యోమయానము, భూయానము, భూగర్భయానము, సముద్రయానము, సముద్ర గర్భయానము— ఓ రామా! తలఁచుకొన్న నొడలు గడగడ వడఁకును! మనుష్యుఁడు సర్వసంచారప్రభావుఁడై యున్నాఁడు. ఈ సౌకర్యములతోడ, తోడునీడ లట్లు, కావలసినన్ని యుపాధు లున్నవి. పూర్వము రమారమి జనసంఖ్య ప్రకారము జాతిప్రాబల్యము దేశ గాంభీర్యము నేర్పడుచుండెడివి. ఇప్పు డన్ననో, ప్రకృతిశాస్త్రజ్ఞులచేఁ గనుఁగొనఁబడియెడు ఫిరంగులు, తుపాకులు, బాంబులు మొదలగు వినాశనక్రియాసాధనయంత్రములచే, జనసంఖ్యల ప్రభావము దినదినక్షయంబుఁ గాంచుచున్నయది. గొఱ్ఱె లెన్ని యున్న నేమి? ఒక్కపులి చాలదా వాని పనిఁదీర్చుటకు? యంత్రబలము లేనివా రెన్ని కోట్లైన నేమి? పురాణపురుషులుగా నున్నయెడల, ప్రకృతిశాస్త్రప్రయుక్తకళాకోవిదులైనవారి నోటిలోఁ బడక తప్పించుకొని పోఁజాలరు. సారము పోయిన పిప్పివంటిది సంఖ్య; దానికన్న సత్త్వము ప్రధానము. బుద్ధిబలమును గార్యశూరత్వము ననుసరించి సత్త్వముండును. ఒక్క బుద్ధి యున్నమాత్రమునఁ జాలదని యడుగడుగునకుఁ దెల్పవలయునా? మన దేశముయొక్క

దౌర్భాగ్యమునకుఁ గారణము మంచి యోజనలు లేమి కాదు; యోజనలతోఁ దీటగు నడువడి లేమి. మాటలకు నాటలకు సంయోగము లేని బ్రదుకు కడతేఱుటెట్లు? తేర్చుటెట్లు? నాగరకత వృద్ధి యగుకొలఁదిని మనుష్యజీవితము ఎక్కువ సంశ్లిష్ట మగును; మన రక్షణముకొఱకు గమనింపవలసిన విషయముల సంఖ్య హెచ్చును. ప్రాఁతరీతి నొకటి రెండు త్రోవలలో, "గుడ్డెద్దు జొన్నచేనిలోఁ బడినట్లు" పోవుచుండినఁ జేటు తప్పదు; సంఘము మనుపటికన్న నెక్కువ క్రియల సాధింపవలయు; కార్యభార మన్ని దిక్కులను ఘనతర మగును; నిమిష నిమిషమునకు నూతన మార్గముల నవలంబింప వలసి వచ్చును; ఏమార్గము మంచిది; యెయ్యది చెడ్డది; ఇది సరియా; యది సరియా; యని క్షణక్షణమునకును సంశయము లుదయించును; చింతా పరంపరలు మిక్కుటము లగును; ఈకష్టములకుఁ దగిన ఫలము లేకపోలేదు గాని, ఊరక హాయిగాఁ గూర్చుండి కాలక్షేపముఁ జేయుటయే మోక్షమను వారికీలోక మావరప్రసాదము నేనాఁటికి నియ్యదు. అట్టి వారికి పరలోకమో, పారతంత్ర్యమో, బహుశః రెండునో, గతి. వృద్ధి హెచ్చుగుకొలఁది యోజనాశక్తియు నెక్కువ బలవంతమగును; కావలసి వచ్చును చూడుఁడు; ఒకటి రెండు విధముల

యోగనుముల ప్రకారము వర్తించు గ్రామీణులలో బుద్ధి వికాసమునకు నావశ్యకతయు నవకాశమును గలదా? కావుననే వారి బుద్ధియు నడతయు మందములై యుండును. పట్టణవాసులలో చర్యావిధానముల సంఖ్య హెచ్చి యుండును గాన, అచ్చటివారు మాటలయందును, మూలఁ గూర్చుండి యోజించుట లందును, ఇతరులకు వల దన్నను బలాత్కారముగ బుద్ధిఁ జెప్పుట యందును గడు సమర్థులుగా నుందురు.

జ్ఞానకర్మంబుల రెంటియు ముఖ్యోద్దేశము ప్రాణరక్షణాభ్యుదయంబులు. మోక్ష మనుట యీనాఁటి మాట గాదు; ఏనాఁటి మాటయుఁ గా దని చెప్పినఁ బాపమా? మోక్షముఁ గోరువారును ఏదో శాశ్వతమైన స్థితి నాశించువారే కదా! ఈస్థితి జడస్థితియా? ఱాళ్ళఅప్పలవలె నుండవలయు ననియా వారికోరిక? మఱి చైతన్యసమేతమా? అది యట్లుండెఁ; అన్నిటికన్న మించిన మహత్తు ప్రాణము. ప్రాణము ద్వివిధము: తనయొక్కయు, తనజాతియొక్కయు నని. ఎల్ల పృథక్పాత్రములయందలి ప్రాణములుఁ బోయిన జాతి యుండదు; ఇఁక జాతి దుర్బల మగుడుఁ బ్రతియొకనికిని ముప్పు దప్పదు. జాతియుఁ బ్రజయు నన్యోన్యాశ్రయములు. జాత్యభివృద్ధికి విరుద్ధములైన ధర్మములును నీతులును ఆత్మహత్యతో సమానములు. ప్రాణముయొక్క

ముఖ్యగుణము కర్మము; జ్ఞానము భృత్యప్రాయము. జ్ఞానము పుట్టినది కర్మగర్భమునుండి; కాని బిడ్డలు తల్లిదండ్రుల నాడించునట్లు, ఆకర్మమును వశముచేసికొను ప్రభావము గలయది. ఉత్పత్తి నెట్లుండినను ఈనాఁటి ప్రచారములఁబట్టి చూచిన నవి రెండును పరస్పరకారణములు; ఇతరేతరోద్దీపకములు. కార్యము ననుసరించి యోజనలు సాఁగుటయు, యోజనల ననుసరించి కార్యంబు సాఁగుటయు రెండును ప్రత్యక్షములు. అయిన నొక్కటి; యోజనలు కార్యములుగఁ బరిణమింపకున్న క్షేత్రమున నాటఁబడని బీజములట్లు నిష్ఫలము లగును. గొడ్డుపోయిన జ్ఞాన మెక్కడ దట్టముగ నుండునో యా దేశము మానసక్షయవ్యాధిబాధిత మని దృఢమ్ముగఁ జెప్పవచ్చును.

జ్ఞానములోని జాతులు రెండు. భూత (స్థితి) జ్ఞానము, భావ్య (స్థాతవ్య) జ్ఞానము. భూత మనఁగా ఉనికికి వచ్చిన వస్తువో, తప్పక సహజముగ వచ్చునదియో; స్థితిందాల్చినదియును, అవశ్యము దాల్చునదియును. స్థితి త్రివిధము; భూత భవిష్య ద్వర్తమానము లని. ఉదా: మనుష్యు లందఱు మర్త్యులు; అనఁగా మరణాధీను లనుట. దీనికి నిర్వచనము: పూర్వులు చచ్చిరి; ఇప్పటివారు చావ నున్నారు; ఇఁక ముందటివారును తప్పక చత్తురు. శరీరియొక్క అనివార్యలక్షణములలో మృత్యు

వైకటి. శరీరికి మృత్యువునకు నుండు సంబంధము సర్వదా సిద్ధము. ఒక్కవేళ నిఁకముందు మనుష్యులు పుట్టకనుకొందము. పుట్టకపోయినను ఈన్యాయమునకు బాధ లేదు. శరీరులుండినను సరే, లేకున్నను సరే; వారికి మృత్యువునకునుండు దాంపత్యము నిత్యమనుట యీన్యాయముయొక్క నిర్వచనము. ఈ దాంపత్యము సిద్ధము. ఇప్పటికాలముంబట్టి చూచిన నెయ్యది భవిష్యత్తో దానినిగూడ సంగ్రహించినట్లు భూతమను పదము వాడఁబడియున్నది. ఏలన, భవిష్యత్తుగూడ స్థితికిఁ జేరినది గావున. మఱియుఁ గాలక్రమముగాఁ జూచిన నిఁక ముందు పుట్టఁబోవువారు చచ్చుట యిప్పటి పని గాకున్నను, ఏన్యాయముంబట్టి వారి మరణము మన మనుమానింపనగునో, ఆన్యాయము ఇఁక ముందు పుట్టఁబోవునది కాదు; అది యెప్పుడో పుట్టినది. శరీరితో నవతరించిన కవల బిడ్డ! ఇప్పుడు సత్యము; రేపు సత్యము; శ్రీరాముల నాఁడును సత్యము. అనఁగా నియ్యది శాశ్వతము; స్వభావలక్షణము. ప్రకృతిశాస్త్రన్యాయము లన్నియు నీ వర్గమునకుఁ జేరినయవి. ఉదా: ఆధారము లేని పదార్థము భూమ్యాకర్షణ శక్తిచేఁ గ్రిందఁ బడును; అగ్నిలోఁ జేయిపెట్టిన నొప్పియగును; ఉష్ణముచే వస్తువుల యాకృతులు పెద్దవగుట బహుళము ఇత్యాదులు *

---

* నాచే రచింపఁబడిన యర్థశాస్త్రమునందలి "న్యాయశబ్ద నిర్వచనము" అను ప్రకరణమున త్రివిధ న్యాయములయు లక్షణములు విపులముగఁ జర్చింపఁబడి యున్నవి.

ఇఁక భావ్య (స్థాతవ్య) జ్ఞానమును విమర్శింతము. భావ్య మనఁగా, వచ్చినది కాదు; తనంతట, తప్పక, స్వభావ సిద్ధముగ రానున్నది కాదు, మఱి అవశ్యము రాఁదగినది; మనచే రప్పింపఁబడవలసినది; ఎయ్యది యుండిన బాగని మనము కోరుదుమో, యెయ్యది తప్పక రాఁదగినదని మనము నిర్ణయింతుమో, అయ్యది భావ్యము. నాకు ఱెక్కలు రావలయుననుట భావ్యము గాదు. ఏలన అది యవశ్యము కాఁదగిన వస్తువు గాదు. భావ్యజ్ఞానమున కుదాహరణము: అందఱు సత్యము చెప్పవలయును. దీనికి నిర్వచన మెట్లనఁగా, అందఱును సత్యము చెప్పుట పూర్వము ప్రసిద్ధికి వచ్చిన వృత్తాంతము గాదు; ఇప్పుడు వచ్చియుండ లేదు; ఇఁక ముందు వచ్చుటయు సందిగ్ధమే; అయిన నొక్కటి; వచ్చినను సరే, రాకున్నను సరే: లవమాత్రమైనను సిద్ధింపకున్నను సరే; అందఱును సత్యము చెప్పవలయు ననుట శాశ్వత న్యాయము. ధర్మములను నీతులను బోధించు న్యాయము లన్నియు నిట్టివి. ఇవి బోధించునవి కృతంబులు గావు; కర్తవ్యములు. ఈ న్యాయములకును రాజశాసనములకును కొన్ని విధముల సామ్యమును గొన్నివిధముల వైషమ్యమును గలదు. అయ్యది నాయర్థశాస్త్రమున విమర్శింపఁబడియె. కాన నిట ననావశ్యము. ఈ నీతి న్యాయములకును ప్రకృతిస్థితికిని ఏసంబంధమును లేదా?

అనఁగా నవి నిష్ప్రయోజనములా? ఏనాఁటికిని గావు. అందఱు సత్యము చెప్పకున్నను, చెప్పవలయు ననుట సర్వత్ర సత్యము. ఈ సత్యముండుటంబట్టియె లోకమునందుఁ గొంతకుఁ గొంతయైన సత్యము ప్రవర్తిల్లుచున్నది. సత్యము ధర్మమగుటచేఁ దత్ప్రకారము వర్తింప మనము ప్రయత్నింతుము. ఈ యత్నమునకును, తన్మూలమున స్థిరించు ఖండమో పూర్ణమో యైన చరిత్రస్థితికిని, ఆనీతియే బీజము. ఆనీతియొక్క ప్రతిబింబమట్లు వర్తమానమును దీర్పఁ జూతుము; ఆనీతి ప్రభావముచే వర్తమానము మన ప్రయత్నానుసారముగ మాఱును. అట్లగుట స్థితిని నిర్ణయించు శక్తులలో భావ్యములకును స్థానమున్నది. స్థితి స్థాతవ్యములు రెండునుసత్తులే. స్థాతవ్యములు మిథ్యలు గావు. ప్రకృతి శక్తులయట్లు అవి మనుష్య ప్రయత్నము లేకయు, యమోఘముగ వర్తింపనేరవు. మన శక్తికొలఁది వాని విజృంభణ ముండును.

కార్యసాధనమునకు భూతభావ్యజ్ఞానములు రెండును ఆవశ్యకములు. స్థితి జ్ఞానముచే మనయొక్కయు ప్రకృతియొక్కయు శక్తులు గోచరించును. స్థాతవ్య జ్ఞానముచే నేయేయర్థములకై మనశక్తియుక్తులఁ బ్రయోగింప వలయు ననుట యేర్పడును. "నాలాభార్థమై నా చాతుర్యమును వినియోగింతునా? దేశశ్రేయమునకై

పాటుపడుదునా? నాకై కాక పరులకై నేనేల శ్రమింపవలయును? స్వార్థత్యాగ మేల విధియయ్యె? దేశము నశించిన నేను నాశములేక యుండుట సాధ్యమా? మనుష్య మహాసంఘములో నిమిడియుండు నణువువంటి వాఁడనా నేను?" ఇత్యాది తర్కములు స్థాతవ్య పరిశోధనలకుఁ జేరిన యవి. పురుషార్థముల నిర్ణయించునది నీతి. ఆయర్థసాధనకై వలయు నుపకరణముల వివరించునది ప్రకృతివిద్య. "ఉండువానిఁగూర్చిన జ్ఞానము" వలన క్రియలయు, తత్ఫలములయు తెఱంగును, "ఉండఁదగినవానిఁ గూర్చిన జ్ఞానము" వలన యుక్తాయుక్తములును, కర్తవ్యములును తేటపడును.

ఇఁకఁ గర్మముసంగతికిం బోదము. ప్రకృత్యాది శాస్త్రంబులలోఁ గనుఁగొనఁబడిన న్యాయంబులను మనుష్య ప్రయోజనార్థక కార్యంబులఁ బ్రయోగించు మార్గంబుల నాదేశించి, మనల సార్థకశ్రములను జేయునది కళ. జ్ఞానమునకు యోజనాశక్తి యొండు చాలును. సత్కళా సామ్రాజ్యమునకు వలయు గుణము లెవ్వి యనఁగా:—(౧)యోజనాశక్తికిం జేరిన ప్రకృతి శాస్త్ర జ్ఞానము. (౨) ప్రకృతి న్యాయ ప్రయోగ జ్ఞానము. (3)యుక్తాయుక్తజ్ఞానము. ఇది తెలియకున్న మనచాతుర్యమంతయుఁ జెడ్డకార్యముల కర్పింతుమేమో! వివేకము లేనిది "ఇది తగు నిది తగ"దని యెట్లు నిరూపింపనగును?

(౮) వివేకముండిననే చాలునా? మంచిచెడ్డల నరసియుఁ జెడ్డయే చేయు దుర్మార్గు లెందఱు లేరు? కావున ధర్మనిరతియు నావశ్యకము. (౯) ఇన్ని మనోభాగ్యము లుండినను కాయపరిశ్రమము లేనిది యేకళయు కొనసాగదు. ఆరోగ్యము, బాహుబలము, పట్టుదలయును భావ్యగుణమ్ములలో ప్రధాన వర్గములకుఁ జేరినయవి. ఆత్మకృషి తప్ప నింకేకృషియు లేనియెడలఁ గోఁతకాలమునందు బొల్లిమాటలు దప్పఁ దక్కిన పంట లేవియు లభింపవు. మనఃకృషితోడ నేత్ర హస్తాదీంద్రియ కృషియు లేకున్న నేమి ఫలము? దేహక్షయము దేశక్షయముఁ బ్రాపించును. బుద్ధి నొక్కదానిని సవిస్తారముఁ జేసిన మాత్రాన నన్నివిధముల మేలులును దమంతట వచ్చి నోటఁ బడు నని కన్నులు మూసికొని, చేతులు గట్టుకొని, పరధ్యానము చేయువారికన్న మూఢు లీ లోకమున నుండరు. మనఃకృషియు హస్తకృషియుఁ గలియకయున్న నేర్పడునది "కళ" గాదు; 'కళంకము'.

ఈతత్త్వము దెలిసిన వారికి ప్రకృతము హిందూదేశములో నవతరించి యుండెడు సర్వకళాశాలలు పరిపూర్ణములు గావని తోఁపక మానదు. వానియందలి లోపము లనే ములు. కళాకృషి మిక్కిలియు న్యూనము. ఆధునిక పాశ్చాత్య సర్వకళాశాలలు విద్యాబోధనశాస్త్రప్రకార నిర్మితములును సర్వప్రజాభివృద్ధికరములును హృదయానందకములు నై యుండఁగా, మన

కళాశాల లింకను పౌరాణికపంకనిర్మగ్నము లై యుండుటఁ జూడఁ గోపతాపంబులు మనస్సును గలంచుచున్న యవి. వీనివలన మన కుపకారము లేకపోలేదు; కాని యది చాలదు. మఱియుఁ బూర్వు లెప్పుడో మంచి చేసి రని యెల్లకాలము కృతజ్ఞతాసూచకముగ వందిమాగధ స్తోత్రములు చేయుచునో, చేతులు గట్టుకొని నోరు మూసికొని భక్తినమ్రతను జూపుచునో ఉండుటకుఁ బౌరుషవంతుఁ డెవ్వఁడును సమ్మతింపఁడు. చిన్నప్పు డక్కఱయైఁ బెంచి పెద్దవానినిగాఁ జేసిరి గదా యని జన్మమంతయు నవ్వాలకు నాహుతిగా నియ్యఁబోలునా? కృతజ్ఞత యెంతో మంచిగుణము; అయినను భావికి ప్రతికూలముల విధించునెడల దాని ననుసరించుట యన్యాయము. పూర్వులయెడ మనము చూపవలసిన భక్తికన్న, ఇఁక ముందు మనచే సృజింపఁబడు సంతతివారి పురోవృద్ధికై వలయు సన్నాహముల నొడఁగూర్పఁ బ్రయత్నించుట ప్రధానతరకృత్యము. రక్షించుటకు శక్తి లేనిచో సృష్టించుట మహాపాతకము! మన పూర్వులు మనల నీలోకమునకుఁ దెచ్చిరి; శక్తికొలఁది భరించిరి గాఁబోలు; అది వారిధర్మము; దానిని వారు చెల్లించుకొని పోయిరి; వారు చేసిన మేలు మఱవఁగూడదు; అట్లనుటచే మన మెవ్వారిమేలునకై యుత్తరవాదులమో యట్టి మన సంతతివారి క్షేమముల నారసి యాచరించు విధమునఁ గాక, ప్రాచీనుల మతప్రకారము వర్తింపవలయు నని యర్థముచేయుట మూఢభక్తి. సంతతివారి క్షేమా

ర్థములైన ధర్మములకంటె మిక్కిలిగా నుపాసింపఁదగిన ముఖ్యధర్మము లెవ్వియును లేవు. "ఉన్నవి; నాయాత్మను నేను కాపాడుకొనుట ప్రథమధర్మము" అనువా రుందురయేని, అట్టివారు సంతానము వడయుట కనస్థాలనియు, హక్కులేనివా రనియుఁ దోఁపకున్న? తన గతి మోక్షములకై సంతానముఁ బడయవలెనన్న, నాకుం జూడ, నియ్యది పరోపకార ధర్మమునకు విఘాతుకమైన తలంపుగఁ గన్పట్టెడిని. అదియట్లుండె; వర్తమాన కాలముయొక్క ముఖ్యకర్మము, భూతకాలములో వేల్వఁబడుట కాదు; భవిష్యత్తును భూతవర్తమానములకంటె నున్నతముఁ జేయఁ ద్రికరణశుద్ధిగ పరిశ్రమించుట.

కావున కృతఘ్నత యను నిందకు భయపడక, సర్వకళాశాలా సంస్కారమున కుద్యోగింపవలయును. మొదటి ప్రేటునకు దీనికి మించిన లక్ష్యము లేదు. ఈ విషయమై "ఆంధ్ర పత్రిక" యొక్క ఈ సంవత్సరాది సంచికలో నాకుఁ దెలిసినమట్టుకు నిదర్శనములతో వ్రాసియున్నాను. దానిం దిలకింప విద్యాసంస్కారోద్యోగులు ప్రార్థితులు. ఇఁక వేలుగ నిట దీర్ఘవాదము నకుం బూనుట నాకు చర్విత చర్వణమే కాదు; మీకు శ్రవణబాధకమును. కావున నింతకాలము నోపికతో నావ్యాసము నవధరించినందునకు వందనము లర్పించుచు, మీయనుజ్ఞమై నింతట విరమించెదను.

A. Patrika Press,—Madras.

END OF
TITLE